ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 288 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | బుధవారం 14 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

## నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూయల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

## భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్‌ఎస్‌ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు

## ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు

- పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైంది



హైదరాబాద్

ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు సృష్టించిందని పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ముందెన్నడూ లేని రీతిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు నెలకొల్పిందన్నారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించిందని చెప్పారు. - మిగతా3లో



## రాష్ట్రాలకు సుప్రీం హెచ్చరిక

- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, క్రీడా సముదాయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలి
- వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలి
- రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకుంటే పెద్దలను, పిల్లలను కుక్కలు కరిస్తే అధిక మెత్తంలో రాష్ట్రాలు పరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం
- అదేవిధంగా కుక్కలకు పుడ్ పెట్టేవారు వారి ఇంట్లోని వాటిని పెంచుకొని అక్కడే వాటికి తిండిపెట్టండి".

# రంగంలో సీఎం!

- మున్సిపల్ ప్రచారం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, 'ఉపాధి హామీ'నిరసనలు
- ముఖ్యమంత్రి జిల్లాల పర్యటన షెడ్యూల్ ఖరారు
- బహిరంగ సభలతో పాటు వీలున్న చోట్ల కార్నర్ మీటింగ్‌లు
- ఈ నెల 16, 17, 18 తేదీల్లో తొలి విడత..ఫిబ్రవరి 3 నుంచి మలి విడత



హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల పర్య టన ఈ దఫా త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగనుంది. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ప్రచారం, పలుచోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉపాధి పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించడానికి నిరసనగా సభలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రెండు దఫా ల పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. తొలి విడతలో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతోపాటు పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారు. నిర్మల్, మహబూబ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు హాజరవుతారు. 19వ తేదీన మేడారం వెళ్తారు. అదే రోజు సింగపూర్, అమెరికా దేశాల పర్యటనకు వెళ్తారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్ తిరిగి వస్తారు. మరుసటి రోజు వీలును బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఫిబ్రవరి 3 నుంచి మలి విడత జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడతారని సీఎంవో వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు ఖరారైన షెడ్యూల్ ప్రకారం ఆయున ఫిబ్రవరి 3వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు ఆరు ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తారు. వరుసగా నల్లగొండ, కరీంనగర్, - మిగతా3లో



## త్వరలో తీపి కబురు


- ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ వేతన పరిమితి పెంపు?
- ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాలను మరింత బలోపేతం
- ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ రెండు సంస్థల వేతన పరిమితిని నెలకు రూ.25,000 నుంచి రూ.30,000 మధ్య స్థాయికి పెంచాలని భావిస్తోంది



## ఇరాన్‌లో భగ్గుమన్న ప్రజాగ్రహం

- నిరసనల్లో 2 వేల మంది మృతి
- ఇరాన్‌లో నిరసనల్లో వేల మంది మృతి
- రాయిటర్స్‌కు వెల్లడించిన ఇరాన్ ప్రభుత్వ అధికారి
- ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా చెలరేగిన ఆందోళనలు


## ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది



- పాకిస్తాన్‌కు చుక్కలు చూపిస్తాం
- భవిష్యత్‌లో ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- ఆర్మీ చీఫ్ హెచ్చరిక

# పురపోరుకు ముమ్మరంగా కసరత్తు

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు.. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన ఈసీ
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడి
- నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధిక ఓటర్లు
- కొత్తగూడెంలో అత్యల్పంగా 1,34,774 మంది ఓటర్లు
- మున్సిపల్ ఎన్నికల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది
- జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు



హైదరాబాద్:

తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 52,43,023 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. వీరిలో 25,62,369 మంది పురుష ఓటర్లు కాగా.. 26,80,014 మంది మహిళా ఓటర్లు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. నిజామాబాద్ కార్పొరేషన్‌లో అత్యధికంగా 3,48,051 మంది - మిగతా3లో




## భారత ఆవిష్కరణలకు నెట్‌ఫ్లిక్స్ చేయూత

- కేంద్ర ప్రభుత్వంతో కీలక భాగస్వామ్యం
- కేంద్ర ప్రభుత్వంతో చేతులు కలిపిన నెట్‌ఫ్లిక్స్
- 'నయే భారత్ కీ నయా పెహచాన్' పేరుతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం
- 8 భారత స్టార్టప్‌ల విజయగాథలపై యానిమేటెడ్ చిత్రాలు
- వివిధ యూనివర్సిటీల విద్యార్థులతో చిత్రాల రూపకల్పన
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ఈ కార్యక్రమం

## మేడారం జాతరకు భారీగా ఏర్పాట్లు



- ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు సమ్మక్క, సారలమ్మ జాతర
- ఈసారి దాదాపు మూడు కోట్లమంది భక్తులు హాజరయ్యే అవకాశం
- గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరు
- ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు

హైదరాబాద్

ఈనెల 28వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ఈసారి దాదాపు మూడు కోట్లమంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వంలోని వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దనసరి అనసూయలు అన్నారు. మేడారం జాతరపై నేడు డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో రాష్ట్ర గిరిజన, ఎస్సి సంక్షేమ ... - మిగతా3లో

## సంపాదకీయం


# అందరి చూపు మోడీ వైపు

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డ చందంగా మారింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి.. రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి ఇప్పుడు భారత్‌పై బాంబు పేల్చాలని నిర్ణయించాడు. రష్యాను ఒప్పించడమో.. ఢీకొనడం సాధ్యం కాక.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై భారీగా టారిఫ్ విధించేందుకు పావులు కదుపుతున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల చట్టానికి అంగీకారం తెలిపారు. సెనేటర్ గ్రాహం ఎక్స్‌లో పోస్ట్ పెట్టి ట్రంప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారాన్ని యుఎస్ పొందుతుంది. వచ్చే వారంలో ఓటింగ్ జరుగనుంది. పుతిన్ యుద్ధానికి పరోక్షంగా నిధులు అందించడానికి భారత్, చైనా కారణమని ట్రంప్ ఆరోపణ. చైనా ప్రపంచంలోని అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారు, భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ ఆంక్షలు రక్తపాతానికి మద్దతును కట్టడి చేస్తాయని గ్రాహం వాదన. గతేడాది భారత దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించినట్లే ఇప్పుడు మరింత గట్టిగా ఉంటుంది. భారత్?అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చలు కొనసాగుతున్నాయి. ఈ బిల్లు ఆంక్షలు ఈ సంభాషణలను ప్రభావితం చేస్తాయి. భారత్ ఆర్థిక వ్యవస్థకు చమురు ధరల పెరుగుదల భారాన్ని మోపవచ్చు. పుతిన్ శాంతి మాటలు చెబుతూనే యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని గ్రాహం విమర్శించారు. ఈ ఆంక్షలు మాస్కో ఆదాయాలను తగ్గించి ఉక్రెయిన్‌కు మద్దతును బలోపేతం చేస్తాయి. బ్రెజిల్ వంటి ఇతర దేశాలు కూడా ఈ జాబితాలో చేరతాయి. ఈ చర్య భారత్‌కు రష్యన్ చమురు ఆధారాన్ని ప్రశ్నిస్తుంది. ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడం, యుఎస్‌తో దౌత్య చర్చలు జరపడం అవసరం. ట్రంప్ విధానం ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించే అవకాశాన్ని కల్పిస్తుంది. కానీ ఆర్థిక సవాళ్లను తెచ్చిపెడుతుంది. ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు. అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదన. నాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మన దేశం మీద అమెరికా ఇప్పటికే 50% టారిఫ్ విధిస్తోంది. అప్పట్లో అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల భారత్ కుప్పకూలుతుందని అందరూ అనుకున్నారు. వారు అనుకున్నట్టుగానే స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. సంపద మొత్తం ఆవిరి అయిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా పరిస్థితి మారిపోయింది. అప్పటి మాదిరిగా కాకపోయినప్పటికీ, అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు వెళ్తూనే ఉన్నాయి. వాస్తవానికి ఈ సుంకాల వల్ల అమెరికాలో ఉన్న కస్టమర్ల మీదనే భారం ఎక్కువగా పడుతుంది. ట్రంప్ వల్ల అమెరికాలో ఆ వస్తువులను కొనేవారికి ఆర్థికంగా భారం పెరిగింది. ఈ ఎఫెక్ట్ ఇండియన్ కంపెనీల ఎగుమతుల మీద కాస్త ప్రభావం చూపించింది. అంతేగాని ఆ సంస్థలు భారీగా నష్టాలు చవిచూసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ట్రంప్ చెబుతున్నట్టుగా 500% సుంకాలు విధించినప్పటికీ ఎగుమతులు కాస్తలో కాస్త క్షీణిస్తాయి. అయితే అమెరికా మార్కెట్లో భారతదేశం నుంచి వచ్చే వస్తువుల ధర పెరుగుతుంది. అలాంటప్పుడు అమెరికా ప్రజలు వాటిని ఒకవేళ ఎంచుకుంటే.. పెద్దగా ఇబ్బంది ఉండదు. అలాంటప్పుడు ట్రంప్ వెయ్యి శాతం సుంకాలు విధించినప్పటికీ పెద్దగా ఇబ్బంది ఉండదు. కాకపోతే అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి వస్తువుల పరిమాణం తగ్గుతుంది.. 500% సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పగానే భారత్ లోని స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. 8 లక్షల కోట్లు ఆవిరి అయిపోయాయి. వాస్తవానికి ఈ నష్టం స్టాక్ మార్కెట్ చరిత్రలో కొత్తది కాకపోయినప్పటికీ.. ట్రంప్ కు భయపడడం మొదలైతే.. అలానే ఇబ్బంది పెడుతూనే ఉంటాడు. కాస్త నిలబడి గట్టి సవాల్ విసిరితే అన్నీ మూసుకొని కూర్చుంటాడు. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మోదీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు

## పురాణ పురుషులు...

# మల్లాది చంద్ర శేఖరులు

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిం దే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ధ ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి. మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచు కున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు. తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్ళారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే




నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్పావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాముల పర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుండడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు. 2005లో ప్రతిష్ఠాత్మక రాజా-లక్ష్మీ అవార్డు ద్వారా వచ్చిన లక్ష రూపాయల నగదును సనాతన ధర్మట్రస్టుకు విరాళమిచ్చారు. పురాణ ప్రవచన సాంప్రదాయం కొనసాగాలనే తపనతో, ఎందరో శిష్యులను తమ ఆశయానికి అనుగుణంగా తీర్చిదిద్దిన పరమ భాగవతో త్తములు చంద్రశేఖర శాస్త్రి... 96 ఏళ్ళ వయసులో జనవరి 14, 2022న వయోభారంతో పాంచభౌతిక కాయాన్ని వదిలి శివైక్యం చెందారు.

# హాస్య రస గుళికలు...జంధ్యాల రచనలు

జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ఈ పేరు తెలుగు ప్రజలకు దాదాపు తెలియ దనే చెప్పాలి. కనీసం ఆ పేరు గల వ్యక్తి ఉన్నారని గాని, ఆయన సుపరిచితు లేనని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని, అత్యంత ప్రజా దరణ పొందిన విజయ వంతమైన సినిమాలకు కథలు, ఆకట్టుకునే సంభాషణలు సమకూర్చారని, చిర కాలం గుర్తుండి పోయే చిత్రాలకు దర్శకత్వం వహించారని సినిమాల తో పరిచయం, సంబంధం ఉన్నా చాలా మందికి తెలియదు. ఆయనే ..హాస్యబ్రహ్మ గా పేరు పొంది, ఇంటి పేరుతో ప్రఖ్యాతి గాంచిన వెండితెర హాస్య బ్రహ్మ జంధ్యాల. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి (జనవరి 14, 1951 – జూన్ 19, 2001 ) తెలుగు సినిమా రచయిత, దర్శకులు. జంధ్యాల అని ఇంటి పేరు తోటే సుప్రసిద్ధుడైన ఆయన అసలుపేరు జంధ్యాల వీర వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి. ప్రత్యేకించి హాస్యకథా చిత్రాలు తీయ టంలో ఆయనది అందె వేసిన చెయ్యి. జంధ్యాల చెప్పిన ప్రసిద్ధ వాక్యం – నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వక పోవడం ఒక రోగం. అనేది నానుడి. జంధ్యాల 1951 జనవరి 14 న పశ్చిమ గోదావరి జిల్లా నరసా పురంలో జన్మించాడు. బి.కామ్ వరకు చదువు కున్నారు. చిన్న తనం నుండి నాటకాల పట్ల ఆసక్తి గా ఉండేవారు. స్వయంగా నాటకా లు రచించారు. ఆయన రాసిన నాటకాల్లో "ఏక్ దిన్ కా సుల్తాన్, గుండెలు మార్చబడును" ప్రముఖ మైనవి. ఆయన నాటకాలు అనేక బహుమతులు అందుకున్నాయి. 1974లో జంధ్యాల సినిమా రంగ ప్రవేశం చేసారు. శంకరాభరణం, సాగర సంగమం, అడవి రాముడు, వేటగాడు వంటి అనేక విజయ వంతమైన సినిమాలకు మాటలు రాశారు. ముద్ద మందారం సినిమా తో దర్శకుడిగా మారి, శ్రీవారికి ప్రేమలేఖ వంటి చిరస్మరణీయ చిత్రాన్ని సృజించారు. 1976 లో దేవుడు చేసిన బొమ్మలు చిత్రం ద్వారా మాటల రచయితగా తన సినిమా జీవితం మొదలు పెట్టారు. ఐదేళ్ళలో సుమారు 85 సినిమాలకు రచయితగా పని చేయగా అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయం సాధిం చడంతో మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత దర్శకు డిగా మారి, అనేక హాస్య చిత్రాలను రూపొందించారు. ఆరోగ్య కరమైన హాస్యానికి జంధ్యాల పేరు గాంచారు. హాస్యబ్రహ్మ అని పేరు



పొందారు. రచయితగా 300కు పైగా సినిమాలు, దర్శకుడు గా షుమారు 50 సినిమాలు చేసారు. అప్పటి కామెడీ హీరోలకు లైఫ్ ఇచ్చాయి ఈయన సినిమాలు. ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించారు. శ్రీలక్ష్మి, బ్రహ్మానందం లాంటి వారిని ఈ రోజుకి ప్రేక్షకులు గుర్తుంచు కున్నారంటే ఆయన సినిమాలే కారణమనేది వాస్తవం. జంధ్యాల కేవలం హాస్యమే కాకుండా అన్ని రకాల ఎమోషన్స్ రచించే వారు. అజరామర 'శంకరా భరణం' చిత్రంతో పాటు 'సప్తపది' జంధ్యాల రచనకు తార్కాణాలుగా నిలిచాయి. సినిమా పరిశ్రమలో జంధ్యాల, కె.రాఘవేంద్రరావుల కాంబినేషన్ కు విశేష ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'అడవి రాముడు', 'వేట గాడు', 'డ్రైవర్ రాముడు', 'జగదేక వీరుడు అతిలోక సుందరి' వంటి చిత్రాలను జన రంజకంగా రూపొందించడంలో జంధ్యాల పాత్ర కీలకంగా నిలిచింది. అలాగే కె.విశ్వ నాథ్, జంధ్యాల కాంబినేషన్ కూడా సూపర్‌హిట్ చిత్రాలకు పెట్టింది పేరు. ఈ కాంబినేషన్‌లో 'శంకరా భరణం', 'సాగర సంగమం' వంటి చిత్రాలొచ్చాయి. దర్శకుడుగా ఆయన మొదటి సినిమా ముద్ద మందారం ఈరోజుకి అంత ఆదరణ పొందుతోంది అంటే ఆయన దర్శకత్వ ప్రతిభే. కామెడీ చిత్రాలకు ఎక్కువగా పని చేసిన జంధ్యాల వేగవంతమైన రచయితగా పేరు తెచ్చు కున్నారు. పది రోజుల్లో సినిమాకు మాటలు రాసేవారు. ఆయన కళాత్మక చిత్రా లకు ఎంత హృద్యంగా రాశారో, హాస్య భరిత చిత్రాలకు అంత చిలిపిగా రాశారు. 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రం దర్శకుడు జాతీయ అవార్డు, 1983లో, "ఆనంద భైరవి" చిత్రానికి ఉత్తమ దర్శకుడు నంది అవార్డు, 1987లో, "పడమటి సంధ్యారాగం" చిత్రానికి ఉత్తమ కథారచయిత అవార్డు, 1992లో, "ఆపద్బాంధవుడు" చిత్రానికి ఉత్తమ మాటల రచయిత అవార్డు లభించాయి. జంధ్యాల తన సినిమాల ద్వారా అనేక మంది నటులను... బ్రహ్మా నందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తి వేలు తదితర నటీనటులను జంధ్యాల సినీ రంగానికి పరిచయం చేశారు. ఇంటి పేరు తోటే ప్రసిద్ధుడైన జంధ్యాలను మీ అసలు పేరు ఏమిటి అని అడిగితే ఆయన ఇలా అనేవాడు: "నేను రామానాయుడి సినిమాకు పనిచేసేటపుడు నాపేరు జంధ్యాల రామానాయుడు, విశ్వనాథ్ గారి సినిమాకు పనిచేసే టపుడు నా పేరు జంధ్యాల విశ్వనాథ్"... అలా అనేవారు తప్ప, తన అసలుపేరు ఎక్కడా చెప్పు కోలేదు. జంధ్యాల 2001 జూన్ 19 న హైదరాబాదులో గుండె పోటుతో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు.... పేర్లు సాహితి, సంపద.

# త్వరలో తీపి కబురు




దేశంలోని కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం త్వరలో తీపి కబురు అందించే అవకాశం ఉంది. ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈపీఎఫ్ఓ (ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ), ఈఎస్ఐసీ (ఉద్యోగుల స్టేట్ బీమా సంస్థ)ల వేతన పరిమితిని పెంచే ప్రతిపాదనను కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం, ఈ రెండు సంస్థల వేతన పరిమితిని నెలకు రూ.25,000 నుంచి రూ.30,000 మధ్య స్థాయికి పెంచాలని భావిస్తోంది.

ప్రస్తుతం ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీల మధ్య వేతన పరిమితుల్లో భారీ వ్యత్యాసం ఉంది.

ఈపీఎఫ్ఓ పరిమితి: నెలకు రూ.15,000 (ఇది 2014 సెప్టెంబర్ నుంచి మార్పు చేయలేదు).

ఈఎస్ఐసీ పరిమితి: నెలకు రూ.21,000.

ఈ వ్యత్యాసం వల్ల వేతనాల పెరుగుదల కారణంగా చాలా మంది ఉద్యోగులు సామాజిక భద్రతా ప్రయోజనాలను కోల్పోతున్నారు. ద్రవ్యోల్బణం, పెరిగిన కనీస వేతనాలు, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రెండు పథకాలను ఏకరీతిగా చేయడం ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం.

**సుప్రీంకోర్టు ఆదేశాలు**

ఈ తాజా పరిణామాల్లో సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలు అత్యంత కీలకంగా మారాయి. జనవరి 2026 ప్రారంభంలో (జనవరి 5 నాటి సమాచారం ప్రకారం) సుప్రీం కోర్టు, ఈపీఎఫ్ఓ వేతన పరిమితిని సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి, ఈపీఎఫ్ఓ బోర్డుకు నాలుగు నెలల గడువు విధించింది. దశాబ్ద కాలంగా పరిమితి మారకపోవడంపై పిటిషనర్లు, ఉద్యోగ సంఘాలు చేసిన పోరాటానికి ఇది ఒక విజయంగా భావించవచ్చు.

**లబ్ధిదారులపై ప్రభావం**

ఈ మార్పు అమల్లోకి వస్తే సామాజిక భద్రతా వలయం గణనీయంగా విస్తరిస్తుంది. ఈపీఎఫ్ఓ పరిధిలో ప్రస్తుతం ఉన్న 8.5 కోట్ల మంది సభ్యుల సంఖ్య భారీగా పెరుగుతుంది. ఈఎస్ఐసీలో ప్రస్తుతం ఉన్న 14 కోట్ల మంది లబ్ధిదారులకుతోడు పరిమితి పెంపుతో మరిన్ని కుటుంబాలకు ఆరోగ్య భద్రత లభిస్తుంది.

**పెరగనున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్**

ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం ఉద్యోగి, యజమాని చెరో 12 శాతం వాటా జమ చేస్తారు. యజమాని వాటాలో 8.33 శాతం పెన్షన్ స్కీమ్ (ఖూూ)కు, 3.67 శాతం పీఎఫ్ ఖాతాకు వెళ్తుంది. వేతన పరిమితి పెరిగితే ఈ కాంట్రిబ్యూషన్ మొత్తం పెరిగి ఉద్యోగుల రిటైర్మెంట్ ఫండ్, పెన్షన్ మరింత మెరుగ్గా మారుతాయి. సాధారణంగా ఈపీఎఫ్ఓ నిబంధనల ప్రకారం, ప్రస్తుతం ఉన్న రూ.15,000 గరిష్ట వేతన పరిమితి ఆధారంగా లెక్కలు కింది విధంగా ఉంటాయి.

1. ఉద్యోగి వాటా (12%): గరిష్టంగా కట్ అయ్యే మొత్తం: రూ.15000లి12%= రూ.1,800.

2. యజమాని వాటా (12%): రెండు భాగాలుగా విడిపోతుంది.

15000లి8.33%= రూ.1250. కాబట్టి, ప్రస్తుత అధికారిక పరిమితి ప్రకారం మీ జీతం నుంచి నెలవారీ గరిష్టంగా కట్ అయ్యే పీఎఫ్ మొత్తం రూ.1,800.

# ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది


**ఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌పై భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందన్నారు. దాయాది పాకిస్తాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని చెప్పుకొచ్చారు. చైనా సరిహద్దుల్లోని భద్రత గురించి ఆర్మీ చీఫ్ ద్వివేది తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. భారత్‌లో త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనం. దేశంలో భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ ద్వారా అది స్పష్టమైంది. జమ్ము కశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా.. ప్రస్తుతం అవి నియంత్రణ లోనే ఉన్నాయి. అలాగే, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయి. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడ్డాయి. అయితే అప్రమత్తంగా ఉండటం కీలకం. భారత మోహరింపులు బలంగా ఉన్నాయి. భవిష్యత్‌లో



ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం. ఆపరేషన్ సమయంలో 88 గంటల పాటు సైన్యం అత్యంత సమర్థవంతంగా పనిచేసింది. కవ్వింపు చర్యలకు దిగితే కచ్చితంగా పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని' అని అన్నారు. ఇదే సమయంలో 2025లో మొత్తం 31 మంది ఉగ్రవాదులు హతమార్చబడ్డారు. వారిలో దాదాపు 65 శాతం మంది పాకిస్తాన్ సంతతికి చెందినవారే ఉన్నారు. వీరిలో ఆపరేషన్ మహాదేవ్ సమయంలో పహల్గామ్ దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులు కూడా ఉన్నారు. స్థానికంగా క్రియాశీలంగా ఉన్న ఉగ్రవాదుల సంఖ్య ఇప్పుడు సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. అయితే, ఉగ్రవాద శ్రేణుల్లోకి కొత్తగా నియామకాలు దాదాపుగా లేవు. మా సమాచారం ప్రకారం దాదాపు ఎనిమిది శిబిరాలు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయి. వీటిలో, రెండు అంతర్జాతీయ సరిహద్దుకు ఎదురుగా.. ఆరు నియంత్రణ రేఖ వెంబడి ఉన్నాయి. ఈ శిబిరాల్లో కొంత ఉనికి లేదా శిక్షణ కార్యకలాపాలు ఉన్నాయని మేము విశ్వసిస్తున్నాం. అందుకే మేము నిశితంగా గమనిస్తూ ఇన్‌పుట్‌లను సేకరిస్తున్నాం. అలాంటి కార్యకలాపాలు మళ్ళీ గుర్తించబడితే, అవసరమైన ఏ చర్యనైనా తీసుకుంటాం అని హెచ్చరించారు.

# ఆరెస్సెస్ ప్రతినిధులతో సమావేశమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా బృందం

చైనా బృందం నేడు ఆరెస్సెస్ ప్రతినిధులతో సమావేశమైంది. నిన్న బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన చైనా బృందం... ఇవాళ ఢిల్లీలోని ప్రేరణ బ్లాక్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులతో భేటీ అయింది. షక్సాగామ్ లోయపై చైనా, భారత్ మధ్య వాగ్యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ భద్రతాం శాల్లో చైనాతో ఇలాంటి సంప్రదింపులు సరికాదని పేర్కొంది. ఆరెస్సెస్ వర్గాల ప్రకారం, చైనా ప్రతినిధి బృందం ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలేను కలిసింది. ఇది




కేవలం మర్యాదపూర్వక భేటీ అని తెలిపాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) విజ్ఞప్తి మేరకు గంటసేపు సమావేశమైనట్లు వెల్లడించాయి. "ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే. ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ పర్యటనలో ఉన్నందున హాజరు కాలేదు. చైనా ప్రతినిధి బృందం దత్తాత్రేయ హోసబలేను కలిసింది. ఈ సమావేశానికి నిర్దిష్ట అజెండా ఏమీ లేదు" అని ఆరెస్సెస్ ప్రతినిధులు తెలిపారు. గత సంవత్సరం ఆగస్టులో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. అయితే, పాకిస్థాన్, టర్కీ, చైనా దేశాల ప్రతినిధులను మాత్రం ఆహ్వానించలేదు.

# అయోధ్య నుండి పూరి.. ఐఆర్సీటీసీ గోల్డెన్ ఆఫర్

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) తరచూ సరికొత్త ప్యాకేజీలను ప్రకటిస్తూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు' ద్వారా ఒక ఆధ్యాత్మిక యాత్రను ప్రకటిచింది. తొమ్మిది రాత్రులు, 10 పగటి రోజులు సాగే ఈ సుదీర్ఘ యాత్ర ఫిబ్రవరి 5వ తేదీన ప్రారంభమై, ఫిబ్రవరి 14వ తేదీతో ముగుస్తుంది. ఈ యాత్ర చేయాలనుకునేవారు గయ, పూరి జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, కోల్‌కతా, గంగాసాగర్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు. ఈ ప్రత్యేక పర్యాటక రైలు ఆగ్రా కాంట్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరుతుంది. ప్రయాణికులు ఈ పర్యటనలో గయలోని విష్ణుపాద ఆలయం, పూరిలోని జగన్నాథ స్వామి ఆలయం, కోణార్క్‌లోని సూర్య దేవాలయం, కోల్‌కతాలోని గంగాసాగర్, జసిదిహ్‌లోని బైద్యనాథ్ ధామ్, వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి, హనుమాన్ గర్హి తదిరత పవిత్ర క్షేత్రాలను దర్శించుకోవచ్చు. ఈ రైలులో మొత్తం 767 సీట్లు అందుబాటులో ఉన్నాయి వీటిలో 2 ఏసీ విభాగంలో 49, 3 ఏసీ విభాగంలో 70, స్లీపర్ క్లాస్‌లో 648 సీట్లు ఉన్నాయి. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా ప్రయాణికులకు సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ లేదా స్లీపర్ క్లాస్ ప్రయాణ సౌకర్యంతో పాటు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో శాకాహార భోజనం అందిస్తారు. అలాగే స్థానిక ప్రాంతాల సందర్శన కోసం ఏసీ లేదా నాన్-ఏసీ బస్సుల సౌకర్యం ఉంటుంది. ధరల విషయానికి వస్తే ఎకానమీ (స్లీపర్) క్లాస్‌కు ఒక్కొక్కరికి రూ. 19,110, స్టాండర్డ్ (థర్డ్ ఏసీ) క్లాస్‌కు రూ. 31,720, కంఫర్ట్ (సెకండ్ ఏసీ) క్లాస్‌కు ₹41,980 గా నిర్ణయించారు. ఐదేళ్ల నుండి 11 ఏళ్ల లోపు పిల్లలకు స్వల్ప రాయితీతో కూడిన ధరలు వర్తిస్తాయి. ఈ ఆధ్యాత్మిక యాత్రను బుక్ చేసుకోవాలనుకునే భక్తులు ఐఆర్సీటీసీ అధికారిక వెబ్‌సైట్ ఒఒఒ.ఱతీఞ్ఞ్షీశీబతీఱంఎ.ఞశీఎ ద్వారా ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. ప్రయాణికుల ఆర్థిక వెసులుబాటు కోసం ఈ ప్యాకేజీని ఈఎంఐ (ఈఎంఐ) పద్ధతిలో కూడా పొందే




అవకాశం కల్పించారు. ఐఆర్సీటీసీ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ద్వారా సులభ వాయిదాల పద్ధతిలో నగదు చెల్లించే వెసులుబాటు ఉంది. తక్కువ ఖర్చుతో దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం అని ఐఆర్‌సీటీసీ తెలిపింది.

## భారత ఆవిష్కరణలకు నెట్‌ఫ్లిక్స్ చేయూత




భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కలిసి ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి అనుగుణంగా 'ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్ – నయే భారత్ కీ నయీ పెహచాన్' పేరుతో ఒక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం సంయుక్తంగా ప్రారంభించాయి. కథల ద్వారా నైపుణ్యాలను, స్టార్టప్‌లను ప్రోత్సహించి దేశంలో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం కింద, సామాజిక ప్రయోజనం లక్ష్యంగా పనిచేస్తున్న 8 భారతీయ స్టార్టప్‌లను పీఎస్ఏ కార్యాలయం ఎంపిక చేసింది. ఈ స్టార్టప్‌ల విజయగాథలను దేశంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, సత్యజిత్ రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ సహా 8 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు యానిమేటెడ్ లఘుచిత్రాలుగా రూపొందించారు. నెట్‌ఫ్లిక్స్ ఫండ్ ఫర్ క్రియేటివ్ ఈక్విటీ సహకారంతో గ్రాఫిటీ స్టూడియోస్ ఈ ప్రాజెక్టును అమలు చేసింది. ఈ చిత్రాలకు అవసరమైన వాయిస్‌ఓవర్‌లను, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (చీఖీణజ) భాగస్వామ్యంతో నెట్‌ఫ్లిక్స్ నిర్వహిస్తున్న 'వాయిస్‌బాక్స్' స్కిల్లింగ్ ప్రోగ్రాం అభ్యర్థులు అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన 26 మంది విద్యార్థులలో 50 శాతం మహిళలు ఉండగా, పలువురు ద్వితీయ శ్రేణి నగరాల నుంచి రావడం గమనార్హం. ఈ సందర్భంగా పీఎస్ఏ ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ.. "సామాజిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, యువతలో నైపుణ్యాలను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది" అని వివరించారు. సృజనాత్మకతను సమాజ సేవకు ఎలా ఉపయోగించవచ్చో ఈ కార్యక్రమం తెలియజేస్తోందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, యువ సృజనకారుల కలయికతో భారత ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## రాష్ట్రాలకు సుప్రీం కోర్టు హెచ్చరిక

**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా వీధికుక్కల బెడద తీవ్రమైన నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రాలు వీధి కుక్కల నివారణకు తగిన చర్యలు తీసుకోకుంటే కఠిన చర్యలు విధిస్తామని ప్రకటించింది. శునకాలు కరవడం వల్ల పిల్లలు లేదా పెద్దలు ఎటువంటి ప్రమాదానికి గురైనా దాని సంబంధించి రాష్ట్రాలే పరిహారం చెల్లించేలా ఆదేశిస్తామని హెచ్చరించింది. దేశవ్యాప్తంగా వీధికుక్కల దాడులు పెరగడంతో ప్రజలలో రేబీస్‌తో పాటు ఇతర ప్రమాదకర వ్యాధులు పెరిగాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, క్రీడా సముదాయాలు, రైల్వే స్టేషన్ల వంటి ప్రజా ప్రదేశాల నుంచి వీధి కుక్కలను తొలగించాలని, వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలని అధికారులను ఆదేశించింది. అయితే తాజాగా ఈ కుక్కల బెడద కేసును సుప్రీంకోర్టు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ రోజు( మంగళవారం) మరోసారి విచారించింది. ఈ నేపథ్యంలో జస్టిస్ విక్రమ్ నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు "వీధి కుక్కల బెడద నివారణకు రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకుంటే పెద్దలను, పిల్లలను కుక్కలు కరిస్తే అధిక మొత్తంలో రాష్ట్రాలు పరిహారం చెల్లించేలా ఆదేశిస్తాం. అదేవిధంగా కుక్కలకు ఫుడ్ పెట్టేవారు వారి ఇంట్లోని వాటిని పెంచుకొని అక్కడే వాటికి తిండిపెట్టండి". అని జస్టిస్ తీవ్రవ్యాఖ్యలు చేశారు. జంతు ప్రేమికులము అని చెప్పుకునే సంస్థలు తొమ్మిదేళ్ల బాలుడిపై శునకాలు దాడి చేసినప్పుడు ఏందుకు బాధ్యత తీసుకోలేదు అని జస్టిస్ ప్రశ్నించారు. అదే విధంగా కుక్కలకు ఆహారం ఇచ్చేవారిపై వేదింపులకు గురవుతున్నాయి అని వచ్చిన పిటిషన్‌ను తీసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అది శాంతిభద్రతల సమస్యని అలా వేధింపులకు గురైన వారు వ్యక్తిగతంగా కేసు నమోదు చేసుకోవాలని సూచించింది. వీధుల్లోని అన్ని కుక్కలను తొలగించాలని తామెప్పుడూ ఆదేశించలేదని యనిమల్ బర్త్ రూల్ ప్రకారం చికిత్స కాని వాటిని షెల్టర్లకు తరలించాలని తెలిపినట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

## ఇరాన్ లో భగ్గుమన్న ప్రజాగ్రహం...




ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి. దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న తెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# మేడారం జాతరకు భారీగా ఏర్పాట్లు

-మొదటిపేజీ తరువాయి

శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్, రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖామంత్రి దనసరి అనసూయ (సీతక్క) లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సవ్యసాచి ఘోష్, అడిషనల్ డీజీలు విజయ్ కుమార్, స్వాతి లక్రా, వివిధ శాఖ కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ మాట్లాడుతూ, గత 2024 మేడారం జాతరకు కోటిన్నర మంది హాజరుకాగా, ఈసారి 2026 లో జాతరకు దాదాపు గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 150 కోట్ల నిధులను మంజూరు చేసి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున ఈసారి దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని వివరించారు. సమ్మక్కసారలక్క జాతరను కుంభమేళాకు మించి అద్భుతంగా నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు పిలుపుని చ్చారు. ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించడం ప్రతి అధికారికి ఒక బాధ్యతగా తీసుకుని, ఏ చిన్న లోపం కూడా లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ జాతరకు రూ.150 కోట్లకుపైగా నిధులు కేటాయించి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతులు, భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు వంటి అన్ని విభాగాల్లో సమగ్ర ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఏ ఒక్క భక్తుడికి కూడా ఇబ్బంది కలగకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసిన మంత్రి, జాతరకు వచ్చే భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా అన్ని ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో స్పష్టమైన దిశా సూచిక బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులు ఎలాంటి అయోమయా నికి గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ పటిష్టంగా ఉండాలని, ప్రత్యేక రూట్ మ్యాప్‌లతో పాటు అవసరమైన చోట వన్‌వే వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. ఈ జాతరపై క్యాబినెట్ మొత్తం ప్రత్యేక దృష్టి సారించిందని, మంత్రులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇలాంటి స్థాయి సమిష్టి పర్యవేక్షణ గతంలో ఎప్పుడూ జరగలేదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి



లక్షలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా వసతి, పార్కింగ్, రవాణా సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ విషయంలో వీఐపీలుసామాన్య భక్తులు అనే తేడా లేకుండా, అందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.

రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి జాతర ఏర్పాట్లకు రూ. 150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణ పనులకు రూ. 101 కోట్లు మొత్తం 251 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేశారని వివరించారు. జాతరకు వచ్చే ప్రతీ భక్తులకు సాఫీగా దర్శనం లభించేలా ప్రాధాన్యత నిస్తున్నట్టు అన్నారు. ఇందుకు గాను ప్రతీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో వివిధ శాఖ కార్యదర్సులు, హెచ్.ఓ.డీ లతో ప్రత్యేకంగా వాట్స్-అప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి జాతర నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సీతక్క సూచించారు. శానిటేషన్, తాగునీరు, రవాణా, భద్రతాలపై ప్రత్యేకంగా ద్రుష్టి సారించాలని, ప్రధానంగా టాయిలెట్ లను మరింత పెంచాలని కోరారు.

జాతర సందర్భంగా గురు, శుక్ర వారాల్లోనే ప్రతి రోజు కనీసం 40 లక్షల మంది భక్తులు ఉంటారని, ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మేడారం జాతరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2010 నుండి ప్రతీ సంవత్సరం వస్తున్నారని, వచ్చే వందేళ్లకు సరిపడా అభివృద్ధి కార్యక్రమాలకు మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారని సీతక్క గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణ రావు మాట్లాడుతూ, జాతర నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నిరంతరం పర్యవేక్షిస్తున్నందున అన్ని శాఖల ఉన్నతాధికారులు జాతర పనులకు సకాలంలో పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి సాధించాలని పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు చేసిన ఏర్పాట్లు, రవాణా, ఇతర సౌకర్యాలు, భక్తులు పాటించాల్సిన సూచనలపై విస్తృత స్థాయిలో సమాచారాన్ని అందించాలని తెలిపారు. మేడారానికి వచ్చే ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకుగాను డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు.

అదేవిధంగా, జాతర సమాచారాన్ని, నియమ నిబంధనలను తెలియచేసే ప్రత్యేక యాప్ ను/ క్యూ.ఆర్ కోడ్ రూపొందించి విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. పార్కింగ్ ఏరియాలలో కూడా ప్రత్యేకంగా వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. శానిటేషన్, పరిశు భ్రతపై ప్రత్యేక ద్రుష్టి సాధించాలన్నారు. ప్రస్తుతం మేడారంలో జరుగుతున్న జాతర ఏర్పాట్లు, పురోగతి తదితర విషయాలను తెలియచేసే నివేదికను ప్రతీ రోజూ తమకు సమర్పించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను కోరారు. ఈ సందర్భంగా, మేడారం జాతరకు వివిధ శాఖలు చేస్తున్న ఏర్పాట్లు, చేపట్టిన పనులు, వాటి పురోగతి పై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. మేడారం జాతరపై ములుగు జిల్లా యంత్రాంగం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు సీతక్క, లక్షణ్ కుమార్, సి.ఎస్ రామకృష్ణ రావు లు ఆవిష్కరించారు.

# గులాబీ బాటలోనే కాంగ్రెస్

**హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీని మొత్తం హైజాక్ చేశాడు. సచివాలయం నుంచి మీడియా సంస్థలకు లీక్స్ ఇస్తున్నాడు. తన అనుకూల మీడియా సంస్థల్లో కథనాలను ప్రసారం చేయిస్తున్నాడు. మంత్రులను ఇబ్బంది పెడుతున్నాడు. వారిని వేధిస్తున్నాడు. కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆ పోస్ట్ నుంచి పక్కన పెట్టడానికి రకరకాల స్టోరీలను టెలికాస్ట్ చేయించాడు. అదే మా కెసిఆర్ అయితే స్మిత సబర్వాల్ మీద ఔట్ లుక్ అనే మ్యాగజిన్ స్టోరీ పబ్లిష్ చేస్తే.. సర్కార్ సొమ్ముతో కోర్టులో కేసు వేయించాడు తెలుసా.. ఇదిగో ఇలా సాగుతోంది గులాబీ పార్టీ ప్రచారం.వాస్తవానికి స్మితా సబర్వాల్ మీద రాసిన స్టోరీ కి, తెలంగాణ ప్రజలకు ఏం సంబంధం? తెలంగాణ ప్రజలు చెల్లించిన పన్ను ను కోర్టు ఫీజుగా చెల్లించడానికి కెసిఆర్ ఎవరు? ముఖ్యమంత్రి అనంతమాత్రాన తనకి ఇష్టమైన అధికారులకు కోర్టు ఫీజులు చెల్లిస్తారా? ఇదే విషయంపై నాడు హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది కదా.. ఆ విషయం గులాబీ పార్టీ పెద్దలకు తెలియదా? ఈరోజు ఇన్ని సుద్దులు




చెబుతున్న గులాబీ పార్టీ.. నాడు మంత్రిగా ఉన్న రాజయ్య విషయంలో, రాజేంద్ర విషయంలో చేసింది ఏంటి? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.రాజయ్య మంత్రిగా ఉన్నప్పుడు నమస్తే తెలంగాణలో అంబులెన్స్ లో కొనుగోలులో కుంభకోణం అంటూ స్టోరీ రాసింది. ఆ తర్వాత రాజయ్యను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసింది. దానికంటే ముందు రాజయ్య మీద గులాబీ పార్టీ అడ్డగోలు నెగిటివ్ ప్రచారం చేసింది. నాడు రాజయ్య తొలగింపు వెనక అంబులెన్సుల కుంభకోణం కాదని, అసలు విషయం వేరే ఉందని ఇప్పటికి గులాబీ నేతలే చెబుతుంటారు.గులాబీ పార్టీకి ఓనర్లమని చెప్పినందుకు ఈటల రాజేందర్ మీద గులాబీ పార్టీ కరపత్రం నమస్తే తెలంగాణ ఎంత వ్యతిరేక కథనాలను ప్రసారం చేసిందో అందరికీ తెలుసు. నాడు ముఖ్యమంత్రికి కొంతమంది లేఖలు రాశారని.. ఆ భూములు అధికారులతో సర్వేలు కూడా నిర్వహించారు. ఈటెల రాజేందర్ కబ్జాకోరు అంటూ ముద్రవేశారు. ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించారు. చివరికి ఆయన గులాబీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. భారతీయ జనతా పార్టీలో చేరి హుజురాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు.. వాస్తవానికి నచ్చని వ్యక్తులను బయటికి పంపించడంలో.. వారిపై అడ్డగోలుగా విమర్శలు చేయడంలో గులాబీ పార్టీ, ఆ పార్టీ అధినేత పీ హెచ్ డీ చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ రాములు నాయక్ వ్యవహారంలో.. అంతకుముందు జరిగిన పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఇవన్నీ బోధపడతాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.కోమటిరెడ్డి వ్యవహారం అనేది చాలా చిన్న విషయమని.. దానిని భూతద్దంలో పెట్టి చూస్తున్న గులాబీ పార్టీ.. గతంలో తన అధినేత ఏం చేశాడో గుర్తుంచుకోవాలని కాంగ్రెస్ నేతలు హితవు పలుకుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను తనకు అనుకూలంగా గులాబీ పార్టీ మార్చుకుంటుందని.. మాకు నీతులు చెప్పేటప్పుడు ముందు తన కింది నలుపు చూసుకోవాలని కాంగ్రెస్ నేతలు సూచిస్తున్నారు.

లీక్ వీరులెవ్వరు

రాజకీయాలు అనేవి కేక్ వాక్ లాగా ఉండవు. ఏదో ఒక రోజు ముసలం పుడుతుంది. అది కాస్త ఉపద్రవం అవుతుంది. అనంతరం ఒక్కసారిగా పరిస్థితులను మార్చేస్తుంది. మనదేశంలో ఇటువంటి పరిణామాలు కేంద్రం నుంచి రాష్ట్రం వరకు అనేకం చోటుచేసుకున్నాయి. సరిగ్గా కొన్ని సంవత్సరాల క్రితం మహారాష్ట్రలో కూడా ఇలానే జరిగింది. ఫలితంగా షిండే ముఖ్యమంత్రి కూడా అయ్యారు. బలమైన నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన.. ముసలం పుట్టించి ముఖ్యమంత్రి అయ్యారు.ఇప్పుడు తెలంగాణలో కూడా అటువంటి పరిస్థితి లేకపోయినప్పటికీ.. కొన్ని మీడియా సంస్థలు కథనాలను ప్రసారం చేస్తున్నాయి. స్టోరీలను సర్కులేట్ చేస్తున్నాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం బాధిత పక్షం లాగా ఉన్నారు. ఆయనపై ఓ చానల్ అడ్డగోలుగా కథనాన్ని ప్రసారం చేసింది. వాస్తవానికి ఇలాంటి కథనం హై లెవెల్ లీక్ లు లేకుండా బయటికి రాదు. అది అసాధ్యం కూడా.. ఎందుకంటే ఉన్నతాధికారుల బదిలీలు మొత్తం కూడా ప్రభుత్వ పెద్దల చేతుల్లో ఉంటాయి. ఎందుకంటే జిల్లాలలో తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా లెక్కలు వేసుకొని ప్రభుత్వ పెద్దలు నిర్ణయాలు తీసుకుంటారు. ఇటీవల బదిలీ అయిన ఆ జిల్లా కలెక్టర్ విషయంలో జరిగింది ఒకటైతే.. ఆ మీడియా ఛానల్ ప్రసారం చేసింది మరొకటి. ఈ వ్యవహారంలో మంత్రి వెంకట్ రెడ్డి తీవ్రంగా కలత చెందారు. తనకు ఇంత విషమిచ్చి చంపేయమని ఆవేదన వ్యక్తం చేశారు.కోమటిరెడ్డి ఆ స్థాయిలో వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో గులాబీ మీడియా సొంత కథనాలను రాయడం మొదలుపెట్టింది. రేవంత్ రెడ్డి పై తిరుగుబాటు మొదలైందని.. అది ఏ క్షణమైనా ఆయనను పదవి నుంచి దించేస్తుందని సొంత భాష్యం చెప్పడం మొదలుపెట్టింది. కోమటిరెడ్డి వెంకటరెడ్డి తిరుగుబాటు ఆ కోణంలోనిదేనని.. ఇప్పుడు ఆయన ప్రత్యర్థులకు ఆయుధంగా మారబోతున్నారని జోష్యం చెప్పింది. వాస్తవానికి రేవంత్ రెడ్డికి, వెంకటరెడ్డికి సాన్నిహిత్యం ఉంది. వారిద్దరు కూడా అన్నా.. అన్నా అని పిలుచుకుంటారు. ఇటీవల డిసిసి అధ్యక్షుడి విషయంలో కూడా కోమటిరెడ్డి మాటనే రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు.. చివరికి రాజగోపాల్ రెడ్డి ఆ స్థాయిలో రేవంత్ రెడ్డి మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ.. వెంకటరెడ్డి అండగా ఉన్నారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం కూడా చేశారు. ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత.. రేవంత్ రెడ్డి కావాలని వెంకటరెడ్డి పై ఎలా కక్ష కడతారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు. ఇదంతా కూడా ప్రతిపక్షాల కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోమటిరెడ్డి తిరుగుబాటు చేసే అవకాశం లేదని.. ఎంతో కష్టపడితే అధికారంలోకి వచ్చిన విషయాన్ని కోమటిరెడ్డి మర్చిపోరని కాంగ్రెస్ నాయకులు గుర్తు చేస్తున్నారు. బిజెపి, బీఆర్ఎస్ నాయకులు శవాల మీద చిల్లర ఏరుకునే రాజకీయాలకు పాల్పడుతున్నారని.. వారి ఆశలు తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు నెరవేరవని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు.

## పురపోరుకు కసరత్తు ముమ్మరం

-మొదటిపేజీ తరువాయి

ఓటర్లు ఉండగా.. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు ఉన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా.. అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలకశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత నోటిఫికేషన్ విడుదల కానుంది. జనాభా ప్రాతిపదికన వార్డులు, డివిజన్లు, ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. మొత్తం ఎన్నికల పర్వంలో రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకం కావడంతో అధికారులు దీనిని సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు రంగం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా రిజర్వేషన్లు ఖరారైన తర్వాత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం పురపాలక శాఖ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

## రంగంలో సీఎం!

-మొదటిపేజీ తరువాయి

రంగారెడ్డి, వరంగల్, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు వెళతారు. తొలి దఫా తరహాలోనే వీలును బట్టి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాప నలు చేస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, కార్నర్ మీటింగ్‌ల ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగ సభలకు హాజరవుతాురు. ఇక ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభలను ఏర్పాుటు చేస్తున్నారు. ఈ సభలను విజయవంతం చేసే బాధ్యతను స్థానిక ఎుమ్మెల్యేలు, ఎంపీలు, ఎుమ్మెుల్సీలు, ఆయా జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మం త్రులకు టీపీసీసీ అప్పగించనుంది. కాగా చివరి రోజు, రెండు రోజుల్లో సీఎం వెళ్లే మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన షెడ్యూల్ ఇంకా పూర్తి స్థాయిలో ఖరారు కావాల్సి ఉంది.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణ రికార్డు

-మొదటిపేజీ తరువాయి

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయి అని అభివర్ణించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయం చేసుకోవడంతోపాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండగ చేసుకుంటున్న రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని మంత్రి వివరించారు. తెలంగాణలో సాధించిన దిగుబడికిగాను రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామన్నారు.

## గులాబీ చిక్కముళ్లు..

## కవిత తప్పేంత? కేటీఆర్ చేసిన ద్రోహం ఏంటి?

**హైదరాబాద్ :** రాజకీయాలలో ముఖ్యంగా కుటుంబాలు నడిపే పార్టీలలో అంతర్గతంగా కుమ్ములాటలు చోటు చేసుకోవడం మనదేశంలో కొత్తేమీ కాదు. గతంలో కాంగ్రెస్ పార్టీ లో సంజయ్ గాంధీ వ్యవహార శైలి ఈ దేశ ప్రజలకు సుపరిచితమే. తమిళనాడులో డీఎంకే, ఉత్తర్ ప్రదేశ్ లో సమాజ్ వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు.. అంతిమంగా అధికారం కోసం, అలవిమాలిన సంపాదన కోసం జరిగే పోరాటాలు ప్రాంతీయ కుటుంబ పార్టీల అసలు బాగోతాన్ని బయటపెడతాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి భారత రాష్ట్ర సమితి కూడా చేరింది.2014లో అధికారంలోకి వచ్చిన భారత రాష్ట్ర సమితి.. తెలంగాణలో వ్యవస్థలను ఎంత నాశనం చేయాలో అంత చేసింది. ప్రత్యర్థి పార్టీల ఎమ్మెల్యేలను అడ్డగోలుగా కొనేసింది. ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకుంది. కాళేశ్వరం నుంచి మొదలు పెడితే గొర్రెల పంపిణీ వరకు ఇలా ప్రతి పథకంలోనూ అవినీతి జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వినిపించాయి. వాస్తవానికి ఇటువంటి కుంభకోణాలు పార్టీకి డ్యామేజ్ చేయడం ఒక ఎత్తు అయితే.. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కలిగించే డ్యామేజ్ మరొక ఎత్తు.వాస్తవానికి గులాబీ పార్టీలో ఈ స్థాయిలో అంతర్గతంగా కుమ్ములాటలు జరుగుతాయని ఎవరూ ఊహించలేదు. సాక్షాత్తు కెసిఆర్ కుమార్తె వ్యతిరేక స్వరాన్ని వినిపిస్తారని.. తన తండ్రి పరిపాలనను ఉదాహరణలతో వివరిస్తూ విమర్శిస్తారని ఎవరూ అంచనా వేయలేదు. కాళేశ్వరం ప్రయోజనం నెరవేరలేదని, పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పండబెట్టారని, సామాజిక తెలంగాణ సహకారం కాలేదని ఇలా ప్రతి విషయంలోనూ కవిత విమర్శలు చేసుకుంటూ పోయారు. కొన్ని సందర్భాలలో లెక్కలతో సహా వివరించారు. ఒక రకంగా ఈ పనిని కాంగ్రెస్ చేయాల్సి ఉండేది. ఒక రకంగా బలమైన స్వరాన్ని వినిపించే ప్రయత్నం చేశారు కవిత.కవిత చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. కానీ 10 సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఏం చేశారు అనేది ఇక్కడ అసలైన ప్రశ్న. భారత రాష్ట్ర సమితి ఏర్పాటును వ్యతిరేకించానని చెప్పిన ఆమె.. పార్టీ ప్రారంభత్సవానికి ఢిల్లీ ఎందుకు వెళ్లినట్టు? 10 సంవత్సరాల కాలంలో తెలంగాణలో విధ్వంసం జరిగిందని చెబుతున్న ఆమె.. గతంలో బంగారు తెలంగాణ సాకారం అయిందని ఎందుకు చెబుతున్నట్టు.. లిక్కర్ కేసులో అడ్డంగా ఇరుక్కుపోయారు కాబట్టి.. కేసుల నుంచి తప్పించుకోవాలంటే ఆమె కెసిఆర్ కు వ్యతిరేకంగా వ్యవహరించాలి కాబట్టి.. అలానే చేస్తున్నారని గులాబీ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్, బిజెపి రాజకీయాల లక్ష్యాలకు అనుగుణంగా ఆమె నడుచుకుంటున్నారని గులాబీ నేతలు మండిపడుతున్నారు.వాస్తవానికి తన పార్టీలో ఉన్నప్పుడు ప్రాధాన్యం దక్కలేదని పదేపదే ఆరోపిస్తున్న కవిత.. ఒకసారి ఎంపీ ఎలా అయ్యారు? మరోసారి ఎమ్మెల్సీ ఎలా అయ్యారు? సింగరేణిలో అధ్యక్షురాలిగా ఎలా ఉన్నారు? ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయని గులాబి పార్టీ నేతలు అంటున్నారు. అధికారం దూరంగానే కెసిఆర్ కు వ్యతిరేకంగా మాట్లాడటం సమంజసం కాదని ఆమెకు గుర్తుచేస్తున్నారు. మరోవైపు జాగృతి నేతలు స్పందిస్తున్న తీరు వేరే విధంగా ఉంది. కేటీఆర్ కూడా ఆమెకు ద్రోహం చేశారని.. కనీసం ఒక పని కూడా చేసుకునే అవకాశం కల్పించలేదని.. ఆమె భర్త ఫోన్ కూడా టాప్ చేశారని.. అలాంటప్పుడు ఆమె పార్టీలో ఎలా ఉంటారంటూ జాగృతి నేతలు చెబుతున్నారు. గడిచిన 10 సంవత్సరాల కాలంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో హరీష్ రావు అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డారని.. అందువల్లే కవిత ఆయన టార్గెట్ చేస్తూ ఆరోపణలు చేస్తున్నారని జాగృతి నేతలు చెబుతున్నారు.. కవిత రాజకీయ ఎదుగుదలను తట్టుకోలేక ఆమెకు అడుగడుగునా అడ్డు పుల్లలు వేస్తున్నారని.. అందువల్లే కవిత ఈ స్థాయిలో స్పందిస్తున్నారని జాగృతి నేతలు అంటున్నారు.కవితకు, కెసిఆర్ కు మధ్యలో గ్యాప్ రావడానికి ప్రధాన కారణం హరీష్, సంతోష్ రావు అని జాగృతి నేతలు చెబుతున్నారు. అందువల్లే ఆమె ఆధారాలతో సహా విమర్శలు చేస్తున్నారని.. ఇందులో వ్యక్తిగత లక్ష్యాలు అంటూ ఏమీ లేవని జాగృతి నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ అంతపురంలో జరిగే కుమ్ములాటలు రాజ్యానికి అసలు మంచివి కావు. ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా ఆ పార్టీకి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. ఇప్పటికే పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలు వచ్చాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలలో అధికార పార్టీకి సానుకూలమైన ఫలితాలు వచ్చాయి. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలు కూడా గులాబీ పార్టీకి రాలేదు. అలాంటప్పుడు ఈ అంతర్గత కుమ్ములాటను ఏ స్థాయిలో కేసీఆర్ పరిష్కరిస్తారో చూడాల్సి ఉంది.

## అక్కడి నుంచి కవిత పోటీ.. అజారుద్దీన్ కి కష్టమే!

**నిజామాబాద్ :** తెలంగాణ మంత్రివర్గ విస్తరణలో భాగంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే ప్రస్తుతం అజారుద్దీన్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాదు. మంత్రి పదవి చేపట్టిన ఆరు నెలల్లో ఎమ్మెల్యే గానీ, ఎమ్మెల్సీ గానీ కావాలి. లేదంటే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత కూడా పోటీకి సిద్ధమవుతోంది. కవిత రాజీనామాను గుత్తాసుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. కవిత స్థానం ఖాళీ కావడంతో, త్వరలోనే భర్తీ ప్రక్రియ ప్రారంభం కానుంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తమ అభ్యర్థిని ఎంపిక చేసుకునేందుకు సంస్థాగత చర్యలు పూర్తి చేసినట్లు సమాచారం.ఖాళీ అయిన కవిత స్థానాన్ని మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఈ స్థానం ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నప్పటికీ, పరిస్థితుల వల్ల మంత్రి పదవి ఇచ్చి మచ్చిక చేసుకున్నారు.

# ఈ వ్యక్తులకు ఉసిరి విషంతో సమానం..



ఉసిరి విటమిన్ సి అద్భుత నిలయం. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి, చర్మం, జుట్టు ఆరోగ్యానికి.. అలాగే గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే ఉసిరిలో అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. ఇది కొంతమందికి హాని కలిగించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తక్కువ రక్తపోటు: ఉసిరి బీపీని తగ్గిస్తుంది. ఎక్కువ బీపీ ఉన్నవారికి ఇది మంచిది. కానీ మీకు ముందే తక్కువ బీపీ ఉంటే.. లేదా బీపీ తగ్గడానికి మందులు వాడుతుంటే ఉసిరిని ఎక్కువగా తింటే బీపీ ఇంకా తగ్గిపోతుంది. అప్పుడు తల తిరగడం లేదా నీరసం రావడం జరగవచ్చు. ఖాళీ కడుపుతో: ఉసిరిలో పులుపు ఎక్కువగా ఉంటుంది. పొద్దున్నే ఖాళీ కడుపుతో ఉసిరి లేదా ఉసిరి రసం తాగితే, కడుపు సున్నితంగా ఉన్నవారికి యాసిడిటీ, గ్యాస్ లేదా గుండెల్లో మంట రావచ్చు. అందుకే ఉసిరిని ఎప్పుడూ ఏదైనా తిన్న తర్వాతే తీసుకోవాలి. షుగర్ మందులు: ఉసిరి రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుంది. మీరు ఇప్పటికే షుగర్ కోసం మందులు వాడుతుంటే, ఉసిరిని ఎక్కువగా తింటే షుగర్ మరీ ఎక్కువగా తగ్గిపోతుంది . ఇలాంటివారు డాక్టర్‌ను అడిగి మాత్రమే ఉసిరి తినాలి. ఆపరేషన్‌కు ముందు: ఉసిరి బీపీని, షుగర్‌ను ప్రభావితం చేస్తుంది కాబట్టి ఏదైనా ఆపరేషన్ జరగడానికి ముందు ఉసిరిని తినడం ఆపేయాలి. ఆపరేషన్ సమయంలో బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచడానికి ఈ జాగ్రత్త అవసరం. రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య: ఉసిరి రక్తాన్ని పల్చగా చేస్తుంది. ఎవరికైతే రక్తం త్వరగా గడ్డకట్టే సమస్య ఉంటుందో, అలాంటివారు ఉసిరిని ఎక్కువగా తింటే, గాయమైనప్పుడు రక్తం కారడం ఎక్కువ కావచ్చు.

# నెల పాటు పూర్తిగా అన్నం తినడం మానేస్తే..



మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మనలో చాలామందికి అన్నం తినందే రోజు గడవదు. రోజుకు మూడు పూటలూ అన్నం తినే వారు ఉన్నారు. కానీ చాలా మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అన్నం తినకుండా ఉండటానికి ప్రయత్నిస్తున్నారు. అవును.. కొంతమంది రోజుకు ఒకసారి మాత్రమే అన్నం తింటారు. మరికొందరు అసలు అన్నమే ముట్టుకోరు. కాబట్టి ఇలా అన్నం మానేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందా, ఇది నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా అని చాలా మందికి సందేహం రావచ్చు.  మన శరీరానికి త్వరగా శక్తినిచ్చే ప్రధాన వనరులలో అన్నం ఒకటి. మీరు అకస్మాత్తుగా అన్నం తినడం మానేస్తే, మీ శరీరం ఈ మార్పుకు అలవాటు పడటానికి కొంత సమయం పడుతుంది. మొదటి కొన్ని రోజుల్లో, మీకు ఆకలి పెరగడం, బలహీనత లేదా కొద్దిగా చిరాకు అనిపించవచ్చు. అందువల్ల, అన్నం బదులుగా మిల్లెట్, బార్లీ, క్వినోవా, గుమ్మడి గింజలు వంటి ఇతర ధాన్యాలను మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. అన్నం కార్బోహైడ్రేట్లతో సమృద్ధిగా ఉంటుంది. సులభంగా జీర్ణమవుతుంది. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి తక్కువ కేలరీలు లభిస్తాయి. ఫలితంగా ఇది బరువు తగ్గడానికి దారితీస్తుంది. బరువు తగ్గాలనుకునే వారు అన్నం తీసుకోవడం తగ్గించవచ్చు. తెల్ల బియ్యం త్వరగా జీర్ణమవుతాయి. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. మీరు ఒక నెల పాటు అన్నం తినడం మానేస్తే, మీ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుకోవచ్చు. ఇది మధుమేహం ఉన్నవారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కొంతమందికి అన్నం తిన్న తర్వాత ఉబ్బరం లేదా మలబద్ధకం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే మీరు అన్నం తినడం మానేస్తే, మీకు మొదట్లో కొంత కడుపు నొప్పి లేదా మలబద్ధకం అనిపించవచ్చు. అయితే మీరు ఎక్కువ పండ్లు, కూరగాయలు, ధాన్యాలు తింటే మీ జీర్ణక్రియ త్వరగా మెరుగుపడుతుంది. బియ్యంలో విటమిన్ బి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. మీరు ఎక్కువసేపు అన్నం తినకపోతే, మీకు ఈ విటమిన్ లోపం ఏర్పడవచ్చు. దీని వలన అలసట, మానసిక స్థితిలో మార్పులు సంభవించవచ్చు. మీరు అన్నం తినడం మానేస్తే, మీ శరీరానికి అవసరమైన విటమిన్ బి, ఇతర ముఖ్యమైన పోషకాలను ఇతర వనరుల నుంచి పొందవలసి ఉంటుంది. అలాగే ఆహారంలో ఆకు కూరలు, చిక్కుళ్ళు, గుడ్లు, పాలు వంటి ప్రత్యామ్నాయ ఆహారాలను చేర్చుకోవల్సి ఉంటుంది.

# లివర్‌ను కడిగిన ముత్యంలా మార్చే ఆయుర్వేద చిట్కా..



సమయం ఏదైనా అవకాశం దొరికినప్పుడల్లా చాలా మంది తినేందుకు ఆసక్తి చూపే పండ్లు.. అరటిపండ్లు. ఈ పండు కడుపు నింపుతుంది. పైగా పోషకమైనది. కానీ అరటిపండ్లతో పాటు వంటగదిలో ఉండే మరో మసాలా దినుసు కలిపి తినడం ద్వారా కాలేయ వ్యాధులను తరిమి కొట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. నేచర్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం.. అరటిపండ్లు, మిరియాలు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి భలేగా పనిచేస్తాయని వెల్లడించింది. దీనిని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా కొవ్వు కాలేయ సమస్యలతో బాధపడేవారికి ఇది అద్భుత సంజీవని. ఈ సమస్యలతో బాధపడేవారు క్రమం తప్పకుండా అరటిపండ్లను మిరియాలతో కలిపి తీసుకోవడం వల్ల సమస్య నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఫ్యాటీ లివర్ అనేది ప్రాథమికంగా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. మద్యం తాగని వారిలోనూ ఈ రకమైన సమస్య పెరుగుతోంది. ఇటీవల, ఢిల్లీలోని ఎయిమ్స్ నిర్వహించిన సర్వే ప్రకారం మన దేశంలో 38.6 శాతం మందికి ఈ రకమైన ఫ్యాటీ లివర్ సమస్య ఉందని తేలింది. వృద్ధులతోపాటు యువకులు కూడా ఈ సమస్యతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. చాలా మందికి ఫ్యాటీ లివర్ ఉన్నట్లు నిర్ధారణ అవుతున్నట్లు వైద్యులు సైతం చెబుతున్నారు. చాలా మంది సకాలంలో ఈ వ్యాధి గుర్తించడం లేదు. అరటిపండ్లలో విటమిన్ దీ6, విటమిన్ సి, డోపమైన్ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవన్నీ కాలేయంలో పేరుకుపోయిన హానికరమైన పదార్థాలను తొలగిస్తాయి. అంతే కాదు అరటిపండ్లలోని స్టార్చ్ కాలేయంలో కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. అరటిపండ్లలోని కరిగే ఫైబర్ పెక్టిన్ పేగులలోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను ఆరోగ్యంగా ఉంచుతుంది. మిరియాలతో కలిపినప్పుడు అరటిపండ్ల ఈ లక్షణాలు మూడు రెట్లు పెరుగుతాయి. మిరియాలలో పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది శరీరంలోని అన్ని ఫ్రీ రాడికల్స్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కాలేయానికి చేరినప్పుడు కణాలను ఉత్తేజపరుస్తుంది. కాబట్టి అరటిపండ్లతో మిరియాలను కలిపి తినడం వల్ల కాలేయంలోని ప్రతి భాగం శుభ్రం అవుతుంది. అయితే రక్తంలో చక్కెర లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



# తిండిని బట్టే నడక..

మనం రోజూ తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలి అనే విషయం చాలా మందికి తెలియదు. ఒక గంటకు 5 కి.మీ. వేగంతో నడిస్తే నిమిషానికి 4-7 కేలరీలు ఖర్చవుతాయి. ముఖ్యంగా రెండు సమోసాలలో ఉండే కేలరీలను కరిగించడానికి ఏకంగా 135 నిమిషాలు నడవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం తీసుకునే ప్రతి ఆహారం జీర్ణం కావడానికి లేదా దానిలోని కేలరీలను కరిగించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విషయంలో పోషకాహార నిపుణులు మనం తినే వివిధ రకాల ఆహారాలలో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి ఎంతసేపు నడవాలనే దాని గురించి వివరణాత్మక సమాచారాన్ని అందించారు. మీ వేగం, శరీర బరువును బట్టి.. గంటకు 5 కి.మీ. వేగంతో నడవడం వల్ల నిమిషానికి 4-7 కిలో కేలరీలు ఖర్చవుతాయి. ఉదాహరణకు.. మీరు 400 కేలరీల భోజనం తింటే, ఆ కేలరీలను బర్న్ చేయడానికి దాదాపు 60-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. బియ్యం..చపాతీ.. పరోటా.. బిర్యానీ: రోజువారీ ఆహారంలో తీసుకునే ప్రధాన వంటకాలైన అన్నం, చపాతీల విషయానికి వస్తే.. అన్నంలో ఉండే కేలరీలను జీర్ణం చేసుకోవడానికి 53 నిమిషాలు నడవాలి. అదేవిధంగా మూడు చపాతీలలో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి 70 నిమిషాల నడక అవసరం. ఆరోగ్యకరమైన చిరుతిండిగా భావించే రెండు గోధుమ పరాఠా తింటే 70 నిమిషాలు నడవాల్సి వస్తుంది. ఇక చాలా మంది ఇష్టపడే చికెన్ బిర్యానీలో దాదాపు 420 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి సుమారు 80-90 నిమిషాల నడక అవసరం అవుతుంది. స్నాక్స్ - ఫాస్ట్ ఫుడ్స్.. సమోసా.. పూరీ.. బర్గర్: నోరూరించే స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్స్ విషయంలో కేలరీల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు.. రెండు సమోసాలలో ఏకంగా 522 కేలరీలు ఉంటాయి. వీటిని కరిగించడానికి సుమారు 135 నిమిషాలు నడవాల్సి వస్తుంది. రుచికరమైన ఆలూ పూరీలో 444 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 85 నిమిషాల నడక అవసరం. ఒక బర్గర్‌లో ఉండే కేలరీలను ఖర్చు చేయడానికి 75 నిమిషాలు నడవాలి. అయితే తేలికైనదిగా భావించే శాండ్‌విచ్‌లో ఉండే కేలరీలను కరిగించడానికి 53 నిమిషాలు నడవాలి. ఫ్రెంచ్ ఫ్రైస్‌లో ఉండే కేలరీలను బర్న్ చేయడానికి ఒక గంట పాటు నడవాల్సి వస్తుంది. దహీ చాట్.. నూడుల్స్: సాధారణంగా ఆరోగ్యకరమైనదిగా భావించే దహీ చాట్‌లో దాదాపు 450 కేలరీలు ఉంటాయి. వీటిని జీర్ణం చేసుకోవడానికి ఏకంగా 115 నిమిషాలు నడవాల్సి వస్తుంది. అదేవిధంగా తక్కువ సమయంలో తినే ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో 400 కేలరీలు ఉంటాయి. వీటిని బర్న్ చేయడానికి 80 నిమిషాల నడక అవసరం. కాబట్టి మనం ఇష్టంగా తీసుకునే ప్రతి ఆహారంలో ఉండే కేలరీలపై అవగాహన కలిగి ఉండటం, వాటిని బర్న్ చేయడానికి సరైన మొత్తంలో వ్యాయామం చేయడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం అని నిపుణులు సూచిస్తున్నారు.

# మేడారం జాతర ఫుల్ షెడ్యూల్

**వరంగల్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు రంగం సిద్ధమైంది. జనవరి 29న సమ్మక్క దేవత గద్దెపై ప్రతిష్ఠించబడటంతో పాటు, భక్తుల మొక్కుల సమర్పణ, దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా నిధులతో విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సమయం దగ్గర పడుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం గ్రామం వనదేవతల రాక కోసం ముస్తాబవుతోంది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలమ్మల మహా జాతర గడియలు సమీపిస్తుండటంతో అటవీ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాలుగు రోజుల పాటు అశేష జనవాహిని మధ్య జరిగే ఈ మహా ఉత్సవానికి ఇప్పటికే పూజారులు ముహూర్తాలు ఖరారు చేశారు.



**జాతర కీలక ఘట్టాలు.. పూర్తి షెడ్యూల్ ఇదే..**

మహా జాతరకు రెండు వారాల ముందు నుంచే మేడారంలో ఆచార వ్యవహారాలు మొదలవుతాయి.

జనవరి 14 గుడిమెలిగే పండగ: దేవతలకు ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

జనవరి 21న మండమెలిగే పండగ: జాతర విజయవంతం కావాలని కోరుతూ పూజారులు దేవతలను ప్రార్థిస్తారు. ఈ రెండు పండుగలు ముగియడంతోనే మేడారంలో జాతర వాతావరణం పీక్ స్టేజ్‌కు చేరుకుంటుంది.

వనదేవతలు గద్దెలకు చేరుకునే క్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య సాగుతుంది.

జనవరి 27: మహబూబాబాద్ జిల్లా నుంచి పగిడిద్దరాజు, కన్నెపల్లి నుంచి జంపన్న మేడారానికి పయనమవుతారు.

జనవరి 28: కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరుతారు.

**జనవరి 29 (కీలక ఘట్టం)**

చిలుకలగుట్ట నుంచి కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క దేవతను పూజారులు తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈ సమయంలో భక్తుల పూనకాలు, శివసత్తుల విన్యాసాలతో అడవి దద్దరిల్లుతుంది.

జనవరి 30: భక్తులు సమర్పించే నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కులతో గద్దెలు నిండిపోతాయి.

జనవరి 31: దేవతల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 4న నిర్వహించే తిరుగువారం పండుగతో ఉత్సవాలు అధికారికంగా సమాప్తమవుతాయి.

**ప్రభుత్వ ఏర్పాట్లు – అభివృద్ధి పనులు**

ఈసారి రికార్డు స్థాయిలో భక్తులు వస్తారనే అంచనాతో తెలంగాణ ప్రభుత్వం రూ. 100 కోట్లకు పైగా నిధులతో ఏర్పాట్లు చేస్తోంది. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీని తట్టుకునేలా క్యూలైన్లను వెడల్పు చేశారు. జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించారు. ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అడవిలో తాత్కాలిక వైద్య శిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక గ్రిడ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఇబ్బంది కలగకుండా వేల మంది సిబ్బందితో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

## తాండూర్‌లో 'అరైవ్ అలైవ్' ప్రోగ్రామ్..

# రోడ్డు భద్రతపై అవగాహన

**తాండూరు :** తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, ఎస్ఐ సౌజన్య, తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వారసంతలో కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ అధ్యక్షతన మంగళవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, ఆటో డ్రైవర్లు, యజమానులు, వివిధ సంస్థల ప్రతినిధులు భారీ సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని, ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు, ఎండలు, విపత్తులు.. ఏ పరిస్థితుల్లోనైనా పోలీసులు ప్రజల కోసం అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. పడినచోట ప్రమాదాన్ని చూసిన వెంటనే సహాయం చేసే వారికి పోలీసులు గౌరవం అందిస్తున్నారని, ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో, యువతలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే కాకుండా, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగా తెలియజేశారు.




**కన్నీరు మున్నీరైన బాధితులు..**

ఈ సదస్సులో గతంలో రోడ్డు ప్రమాదాల్లో తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితులు పాల్గొని తమ ఆవేదనను పంచుకున్నారు. తల్లీ, తండ్రి, ఎదిగివచ్చిన కుమారులు, కూతుర్లు, సంపాదించే వ్యక్తిని యాక్సిడెంట్‌లో కోల్పోయి వారు అనుభవిస్తున్న బాధలు వెల్లడించారు. తమకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని వారు కన్నీటి పర్యంతమయ్యారు. వారి మాటలు సదస్సులో అందరిని ఆలోచింపజేశాయి. ఆ తర్వాత అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఎమ్మెల్యేతోపాటు నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆర్థిక సాయంగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఇంచార్జ్ ఎంపిడివో వేణుగోపాల్ రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆటో డ్రైవర్లు, యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

### ఇల్లెందు మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

**ఇల్లెందు :** ఇల్లెందు మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన 150 కుటుంబాలు, ఐదుగురు వార్డు సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి హరిప్రియ నాయక్ సమక్షంలో మంగళారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ మర్రిగూడెం నాయకురాలు యదలపల్లి రేణుక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మర్రిగూడెం, కొమ్ముగూడెం గ్రామ పంచాయతీలకు చెందిన ఇండిపెండెంట్, ఎన్డీ పార్టీలో గెలిచిన ఐదుగురు వార్డు మెంబర్లు, అధికార కాంగ్రెస్ పార్టీ నుండి 100 కుటుంబాలు, అలాగే ఎన్డీ, ఇతర పార్టీల నుండి 50 కుటుంబాలు మొత్తం 150 కుటుంబాలు మండల అధ్యక్షుడు శీలం రమేశ్ అధ్యక్షతన బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందనడానికి చేరికలను చూస్తే అర్థమవుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన యువకులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఖమ్మం పాటి రేణుక, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, బీఆర్ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, సిలివేరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మౌనిక, స్థానిక నాయకులు సారయ్య, కోటి, సువర్ణపాక సత్యనారాయణ పాల్గొన్నారు.



### కాంపెల్లి సోలార్ ఎనర్జీ న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

**రామవరం, జనవరి 13 :** బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు, మాజీ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు, పాల్వంచకు చెందిన కాంపెల్లి కనకేష్ పటేల్‌కు చెందిన కాంపెల్లి సోలార్ ఎనర్జీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను పార్టీ జిల్లా కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా వెంకటేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. థర్మల్ విద్యుత్ వల్ల కాలుష్యం పెరుగుతుందని, విద్యుత్ తయారీకి ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. కావునా ప్రతి ఒక్కరు తమ ఇంటిపై సోలార్ అమర్చుకుంటే ఎవరింటికి సరిపడా వారు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా కాలుష్యం తగ్గుతుందన్నారు. గృహ అవసరాలకు సోలార్ ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం రూ.78 వేల వరకు సబ్సిడీ ఇస్తుందన్నారు. అంతేకాకుండా బ్యాంక్ రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో దిండిగల రాజేందర్, కాపు సీతాలక్ష్మి, మల్లెల రవిచంద్ర, కొట్టి వెంకటేశ్వర్లు, వేల్పుల దామోదర్, లకావత్ గిరిబాబు, మంతపురి రాజు గౌడ్, కోడి అమరేందర్, గోపిరెడ్డి, కాపు కృష్ణ, కాలేరు సింధు తపస్వి, బాదావత్ శాంతి, లావుడ్య సత్యనారాయణ, గోవాడ గుణ చరిత్, తోటలోహిత్ సాయి, నవతన్, బట్టు జవహర్, ఇర్ఫాన్, కాలేరు అఖిల్, మహర్షి పాల్గొన్నారు.




### మహిళా సాధికారితకు ప్రోత్సాహం : ఆకుల వెంకటేశ్



**తాండూర్, జనవరి 13 :** మహిళా సాధికారిత కోసం ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేశ్, ఏపీఎం శ్యామల అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధి రేపల్లెవాడ గ్రామంలో అభినయ గ్రామ సంఘం వారికి పెరటి కోళ్ల పెంపకం పథకం ద్వారా మంజూరైన 26 యూనిట్స్ కోళ్లను గ్రూప్ సభ్యులకు అందజేయడం జరిగింది. ఒక కోడికి రూ.130 చొప్పున సబ్సిడీ ద్వారా అందించినట్లు వారు తెలిపారు. అవి పెరిగి పెద్దగా అయిన తర్వాత వాటి అమ్మకం ద్వారా వచ్చిన లాభాలను సభ్యులందరూ పొందిన తర్వాత సబ్సిడీ కింద ఇచ్చిన కోళ్లకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి మొత్తం 250 యూనిట్స్ రావడం జరిగిందని ఏపీఎం తెలిపారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పై వచ్చే పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా మరింత ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొల్లూరి సంగీత, సీసీ రాజేశ్వరి, వీవీఏ విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగు భళా.. మద్దతు ధర దక్కదేమోనని రైతు ఆందోళన..!



**కుభీర్ :** అన్నం పెట్టే రైతన్నకు సున్నం పెట్టినట్లుగా ఉంది రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారం. ఆరుగాలం రెక్కలను ముక్కలు చేసుకుని కష్టించి పండించిన పంటకు మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్ట పోతున్న రైతన్నలకు భరోసా లేకుండా పోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి కారణంగా ప్రధాన పంటలైన సోయా, పత్తి దెబ్బతిని సగానికి సగం దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం కోర్రీలు పెట్టి 25% సోయాబీన్ కూడా కొనుగోలు చేయలేదు. దాంతో రైతులు దళారులకు, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు పంటను అమ్ముకున్నారు. పీకల్లోతూ కష్టాల్లో మునిగిపోయారు. ఫలితంగా యాసంగిలోనైనా పత్తి, సోయాకు బదులుగా మొక్కజొన్న సాగుచేసి కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చుకొందామని మండలంలోని రైతులు భావించారు. అనుకున్నట్లుగానే గత ఏడాది యాసంగి కంటే ఈ ఏడు యాసంగిలో మొక్కజొన్నను దాదాపు రెట్టింపు సాగుచేశారు. నిరుడు 9 వేల పైచిలుకు ఎకరాల్లో మొక్కజొన్న సాగవగా.. ఈ ఏడు 13 వేల ఎకరాల్లో సాగు జరిగింది. జనవరి చివరి వారం నుండి మొక్క జొన్న కోతకు రానుంది. ఈ తరుణంలో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొక్కజొన్నకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడంతో గిట్టుబాటు అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పంటలు సాగుచేసిన రైతాంగాన్ని ఆగం పట్టిస్తోంది. సోయా పంటను కొంటామని చెప్పి రంగు మారిందని, తేమ ఉందని, జల్లెడ పేరిట సవాలక్ష ఆంక్షలు విధించి కేవలం 40, 50 శాతం మాత్రమే కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టారు. మొక్కకొన్న చేతికొచ్చిన తర్వాత అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్నకు కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ రూ. 2400 ప్రకటించినప్పటికీ.. పంట చేతికొచ్చేలోపు కొనుగోలు కేంద్రాలను తెరిచి సకాలంలో కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. గత ఏడాది మార్చిలో ప్రైవేటులో క్వింటా మక్కలకు రూ.18,00 నుంచి 2,100 చెల్లించారు. ఈ సారి మద్దతు ధర కంటే ఎక్కువగా క్వింటా మక్కలకు కనీసం రూ.2600 లభిస్తే కొంతలో కొంతైనా నష్టాలను పూడ్చుకోవచ్చంటున్నారు రైతులు. ప్రభుత్వం నెలరోజుల ముందే మండలంలో కనీసం 4 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని మండల రైతాంగం కోరుకుంటోంది.

### ఏవైనా ఉంటే గవర్నమెంట్‌ను అడుక్కోండి.. నిలదీసిన ప్రజలతో మంత్రి వివేక్ దురుసు ప్రవర్తన



మంచిర్యాల జిల్లాలో మంత్రి వివేక్ వెంకటస్వామికి నిరసన సెగ తగిలింది. తమ ప్రాంత సమస్యలపై క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు మంత్రిని నిలదీశారు. ముఖ్యంగా రహదారి పనులు కూడా చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఒక్క అభివృద్ధి పని కూడా కనిపించడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానికుల ప్రశ్నలతో మంత్రి వివేక్ వెంకటస్వామి తీవ్ర అసహనానికి గురయ్యారు. సమస్యలపై నిలదీసిన ప్రజలతోనే మంత్రి వివేక్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు రఘునాథ రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. రహదారి అవసరమైతే ప్రభుత్వాన్ని అడుక్కోండంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. తమ సమస్యల గురించి వినకుండా, దురుసుగా వ్యవహరించారంటూ మంత్రి వివేక్ తీరుపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

## బిజినెస్

### విపణిలోకి బ్రిటన్ మడ్డీఫాక్స్ సైకిళ్లు




**ముంబయి:** బ్రిటన్ సంస్థ మడ్డీఫాక్స్ 18 మోడళ్ల సైకిళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. రోమ్, కైలాన్ బైసైకిల్ బ్రాండ్లను కలిగి ఉన్న అనంత వెంచర్స్‌తో ఇందుకోసం ఒప్పందంపై సంతకం చేసినట్లు మడ్డీఫాక్స్ తెలిపింది. భారత్‌లో తమ ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్‌గా అనంత వెంచర్స్ ఉంటుందని పేర్కొంది. 'ఐరోపాలో ప్రాచుర్యం పొందిన తాము, భారతీయ వినియోగదార్ల అవసరాలకు తగ్గట్లు మారేందుకు సిద్ధంగా ఉన్నామ'ని మడ్డీఫాక్స్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఎండీ సాహిల్ మెహ్రోత్రా వెల్లడించారు. కంపెనీ ఉత్పత్తి శ్రేణిలో రోడ్లపై, పర్వత ప్రాంతాల్లో సైక్లింగ్‌కు తోడ్పడేవి, హైబ్రిడ్ బైక్‌లు ఉన్నాయి. మహిళలు-పిల్లల కోసం ప్రత్యేక బైక్‌లు ఉన్నాయని సంస్థ పేర్కొంది. 'ధరలు బేరీజు వేసుకునే వినియోగదార్ల కోసం మా వద్ద రోమ్, కైలాన్ బ్రాండ్లు ఉన్నాయి. అధిక-నాణ్యత, ప్రీమియం బ్రాండ్ ఉత్పత్తులు, గొప్ప రైడింగ్ అనుభూతి కోసం మడ్డీఫాక్స్ ఉత్పత్తులు లభిస్తాయని' అనంత వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అజిత్ గాంధీ వెల్లడించారు.

### రిటెయిల్ ధరలు పెరుగుతున్నాయ్



**దిల్లీ:** ఆహార వస్తువుల ధరలు పెరగడంతో, 2025 డిసెంబరులో రిటెయిల్ ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్ఠమైన 1.33 శాతానికి పెరిగింది. గతేడాది అక్టోబరులో రికార్డు కనిష్ఠమైన 0.25%, నవంబరులో 0.71 శాతంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం నమోదైన సంగతి విదితమే. 2024 డిసెంబరులో మాత్రం ఇది 5.22 శాతంగా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ఈ గణాంకాలను సోమవారం విడుదల చేసింది. వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కవేసే రిటెయిల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత 4% కంటే దిగువనే నమోదు కావడం విశేషం. డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం -2.71 శాతంగా నమోదైంది. వరుసగా ఏడో నెలా ఆహార ద్రవ్యోల్బణం ప్రతికూలంగానే కొనసాగింది. కూరగాయలు, గుడ్లు, మాంసం, చేపలు, సుగంధ ద్రవ్యాలు, పప్పుల ధరలు పెరగడంతో, అక్టోబరు-నవంబరుతో పోలిస్తే, డిసెంబరులో ఆహార ద్రవ్యోల్బణం అధికమైంది. ద్రవ్యోల్బణం పట్టణ ప్రాంతాల్లో 2.03 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 0.76 శాతంగా ఉంది. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ (9.49%), కర్ణాటక (2.99%), ఆంధ్రప్రదేశ్ (2.71%), తమిళనాడు (2.67%), జమ్మూ కశ్మీర్ (2.26%) ఉన్నాయి. అస్సాం, బిహార్, హరియాణా, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్‌లో ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది.

### టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్ విడుదల

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ పాసింజర్స్ వెహికల్స్.. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.5.59 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. నేటి నుంచి (జనవరి 13) బుకింగ్స్ ప్రారంభిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో హ్యుందాయ్ ఎక్స్‌టర్, నిస్సాన్ మాగ్నైట్, రెనో కైగర్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వంటి కార్లతో ఇది పోటీ పడనుంది. టాటా పంచ్ ఫేస్‌లిఫ్ట్.. పంచ్.ఈవీని పోలి ఉంటుంది. కొత్త పంచ్‌లో ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్‌ను రీడిజైన్ చేశారు. డీఆర్ఎల్స్‌ను కొత్తగా తీర్చిదిద్దారు. స్పోర్టియర్ బంపర్స్, సరికొత్త అల్లాయ్ డిజైన్, కొత్త ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్ క్లస్టర్ ఆకట్టుకుంటాయి. ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, రేర్ వాషర్ వైపర్స్‌ను ఇచ్చారు. కొత్తగా సైంటిఫిక్, కారామెల్, బెంగాల్ రూజ్, కూర్గ్ క్లౌడ్స్ వంటి కలర్ ఆప్షన్స్‌తో పంచ్ లభిస్తుంది. ఇంటీరియర్ పరంగానూ పలు మార్పులు చేశారు.

# ఇరాన్‌తో వ్యాపారం చేస్తే 25శాతం టారిఫ్‌లు




రష్యా చమురు కొనుగోళ్ల కారణంగా ఇప్పటికే 50శాతం సుంకాలను ఎదుర్కొంటోన్న భారత్‌కు తాజాగా మరో సవాల్ ఎదురైంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనే ఇందుక్కారణం. ఎందుకంటే ఇరాన్ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో భారత్ ఇరాన్-భారత్ వాణిజ్యం ఇలా..టెహ్రాన్‌లోని భారత ఎంబసీ గణాంకాల ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఇరాన్‌కు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో 0.44 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను టెహ్రాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అంటే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ దాదాపు 1.68 బిలియన్ డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.15వేల కోట్లకు పైమాటే.భారత్ నుంచి ప్రధానంగా బియ్యం, తేయాకు, చక్కెర, ఫార్మా, ఆర్గానిక్ రసాయనాలు వంటివి ఇరాన్‌కు ఎగుమతి అవుతున్నాయి. వీటిలో అత్యధికంగా సేంద్రియ రసాయనాల ఎగుమతుల విలువ 512.92 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇక, టెహ్రాన్ నుంచి మనం పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్, పండ్లు, నట్స్ వంటి వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 311.60 బిలియన్ డాలర్ల విలువైన పిస్తా, ఇతర ఎండుఫలాలు, నట్స్ ఇరాన్ నుంచి దిగుమతి అయ్యాయి. అయితే ట్రంప్ నిర్ణయం వాణిజ్యపరంగానే గాక, భారత వ్యూహాత్మక ప్రయోజనాల పైనా ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. భారత ప్రాంతీయ అనుసంధాన ప్రణాళికలు, సరఫరా గొలుసుకు ఇరాన్‌తో కలిసి చేపడుతోన్న చాబహార్ పోర్ట్ ప్రాజెక్ట్ అత్యంత కీలకం. గతంలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలు విధించిన సమయంలో ఈ పోర్ట్‌కు కొన్ని మినహాయింపులు కల్పించింది. ఇప్పుడు తాజా టారిఫ్‌ల ప్రకటనతో ఈ ప్రాజెక్ట్ భవితవ్యంపై అనిశ్చితి నెలకొంది. 75శాతం బాదుడు తప్పదా?రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో ఇప్పటికే భారత ఉత్పత్తులపై ట్రంప్ 50శాతం సుంకాలను వసూలు చేస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్ చేసుకునేందుకు గత కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నా యి. ఈ పరిణామాల వేళ తాజా టారిఫ్‌ల ప్రకటనతో భారత్-అమెరికా వాణిజ్యఒప్పందంపై మరోసారి సందిగ్ధత నెలకొంది. అంతేకాదు.. ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కొనసాగితే.. భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 75 శాతానికి పెరుగుతాయి. అది మన దేశంలోని పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. అయితే, ట్రంప్‌ తాజాగా ప్రకటించిన టారిఫ్‌లు ఎంతవరకు అమల్లో ఉంటాయనే దానిపైనా స్పష్టత లేదు. ఎందుకంటే.. ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు విధిస్తున్న టారిఫ్‌లకు చట్టబద్ధత ఉందా? లేదా అన్నదానిపై అగ్రరాజ్యంలోని సుప్రీంకోర్టు బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) కీలక తీర్పు వెలువరించనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. "టారిఫ్‌లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరిస్తే అమెరికా వందల కొద్దీ బిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మన దేశంలోకి పెట్టబడులు కూడా తగ్గుతాయి. ఇతర దేశాలు మన దగ్గరకు వచ్చి ఫ్యాక్టరీలు, ప్లాంట్లను నిర్మించరు. ఈ టారిఫ్‌లతో ఇప్పుడు అమెరికా వెలిగిపోతోంది. ఇదిలాగే కొనసాగాలి. జాతీయ భద్రతకు సంబంధించిన ఈ విషయంలో సుప్రీం తీర్పు వ్యతిరేకంగా వస్తే మాత్రం అది అమెరికాకు తీవ్ర ఇబ్బందే" అని ట్రంప్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు.

## డి-మార్ట్‌లో సరుకుల రేట్స్ ఎందుకు అంత తక్కువగా ఉంటాయి?

డి మార్ట్ ప్రస్తుతం భారతదేశంలో మధ్యతరగతి కుటుంబాలకు అత్యంత విశ్వసనీయమైన సూపర్ మార్కెట్‌లో ఒకటి. చిన్న మ్యాగీ నుండి బిస్కెట్లు, చాక్లెట్లు, ఇలా ఇంట్లోకి ఏ నిత్యావసర వస్తువుల కావాలన్నా డిమార్ట్ వెళ్లాల్సిందే.ఎందుకంటే అక్కడ ప్రతిదానిపై మన డిస్కౌంట్ లభిస్తుంది.. ఇతర మార్కెట్‌లో పోల్చుకుంటే అక్కడ తక్కువ ధరకు సరుకులు దొరుకుతాయి. ఉదాహరణకు, డి మార్ట్ రూ.149 విలువైన పాల ఉత్పత్తులను ఆఫర్ కింద రూ.99లకే పొందచ్చు. అలానే రూ. 99 ఉన్న మ్యాగీని రూ.73కి విక్రయిస్తుంది. అందుకే చాలా మంది డీమార్ట్ వెళ్లి షాపింగ్ చేస్తారు. ఈ ఆఫర్‌ల కారణంగా డీమార్ట్ ఇతర మార్కెట్‌లను వెనక్కి నూకి టాప్‌లో ఉంటుంది.తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలుఅయితే ఇక్కడ చాలా మందికి వచ్చే డౌట్ ఏమిటంటే..తక్కువ ధరకే సరుకులు ఇవ్వడం ద్వారా డీమార్ట్‌కు నష్టాలు రావా అని.. చాలా మందికి తెలియ న విషయం ఏమిటంటే.. డీ మార్ట్ అనే కంపెనీ ఎక్కువ లాభం పొందడం కంటే తక్కువ లాభంతో ఎక్కువ అమ్మకాలు చేయడంపై దృష్టి పెడుతుంది. డి మార్ట్‌లో రోజువారీ నిత్యావసర వస్తువులు ఎక్కువగా అమ్ముడవుతాయి. దీంతో స్టాక్‌ను త్వరగా అమ్మివేసి, దాని పెట్టుబడిపై త్వరగా రాబడిని పొందుతుంది. ఇక్కడ మీరు తెలుసుకోవాల్సిన మరో ముఖ్య మైన విషయం ఏమిటంటే, డీమార్ట్ కంపెనీ సరఫరాదారులతో వ్యవహరించే విధానం. సాధారణంగా ఇతర రిటైల్ కంపెనీలు విక్రేత బిల్లులను క్లియర్ చేయడానికి టైం




తీసుకుంటారు. కానీ డీమార్ట్ మాత్రం ప్రతి నెలా బిల్స్ క్లియర్ చేస్తుంది. దీంతో తయారీదారుకుల కూడా కాస్తా తక్కువ ధరకే డీమార్ట్‌కు వస్తువుల సరఫరా చేస్తారు. అలాగే ఒకేసారి బల్క్‌లో వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా కంపెనీకి భారీ లభిస్తుంది.ఖర్చుల విషయంలో జాగ్రత్తలుడి మార్ట్ తన ఖర్చుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరి స్తుంది. డిమార్ట్ ఎక్కువగా సొంతం స్థలంలోనే సూపర్ మార్కెట్‌లను ఏర్పాటు చేసుకుంటుంది. ఎక్కడైనా రెంట్ తీసుకోవాల్సి వాటిని దీర్ఘకాలిక లీజులకు తీసుకుంటుంది. అందుకే ఖాళీ షెటర్‌లను అద్దెకు ఇస్తుంది.తద్వారా, అద్దె ఖర్చు తగ్గుతుంది. డి మార్ట్ ఖరీదైన ఇంటీరియర్స్, భారీ ఎయిర్ కండిషనింగ్, మ్యూజిక్ సిస్టమ్స్ మొదలైన వాటిపై పెద్దగా ఖర్చు చేయదు దాని వల్ల ఆదా చేసిన డబ్బును డిస్కౌంట్ల రూపంలో కస్టమర్లకు అందిస్తుంది.డీ-మార్ట్ ఓనర్ విజన్, అనుభవండిమార్ట్ ఇంత సక్సెస్ కావడానికి మెయిన్ రీజన్.. ఈ కంపెనీ యజమాని అయిన రాధాకిషన్ దమానికి ఉన్న అనుభవం. స్టాక్ మార్కెట్లో తాను సంపాదించిన అనుభవాన్ని రిటైల్ రంగంలో ఉపయో గించుకుని అతను డీమార్ట్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చారు. కేవలం ఒక్క స్టోర్‌తో ప్రారంభమైన అతని ప్రయాణం ఇప్పుడు దేశవ్యాప్తంగా వందలాది స్టోర్‌లకు చేరుకుంది. మొత్తంగా చూసుకుంటే తక్కువ ఖర్చులు, త్వరితగత చెల్లింపులు, నిత్యావసరాలపై దృష్టి పెట్టడంతో డి-మార్ట్ ప్రజలకు తక్కువ ధరలతో సరుకులను అందించగలుగుతుంది.

# ప్రపంచకప్ కోసం నెదర్లాండ్స్ స్క్వాడ్..

## స్పోర్ట్స్

# బ్యాటింగ్ భారం మోసేది వీళ్లే!

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి ప్రపంచకప్ కోసం నెదర్లాండ్స్ క్రికెట్ స్క్వాడ్‌ను వెల్లడించింది. గత సీజన్‌లో జట్టును నడిపించిన స్కాట్ ఎడ్వర్డ్స్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. అనుభవజ్ఞులు, కుర్రాళ్లతో కలగలిసిన పటిష్టమైన స్క్వాడ్‌ను మెగా టోర్నీకి ఎంపిక చేశామని సెలెక్టర్లు తెలిపారు. వాండర్ మెర్వే,బస్ డె లీడే, మైఖేల్ లివిట్, జాచ్ లయన్ కాచెట్, 34 ఏళ్ల ఆల్‌రౌండర్ కొలిన్ అకెర్మన్ బ్యాటింగ్ భారాన్ని మోస్తారని హెడ్‌కోచ్ రియాన్ కుక్ పేర్కొన్నాడు. స్క్వాడ్ ప్రకటన సందర్భంగా హెడ్‌కోచ్ రియాన్ కుక్ మాట్లాడుతూ.. గతంలో వరల్డ్‌కప్‌లు ఆడిన అనుభవం మాకుంది. అంతేకాకుండా భారత్, శ్రీలంకలో ఈమధ్య ఆడాం. వరల్డ్‌కప్ గ్రూప్‌లోని అన్ని జట్లతో ఇటీవల ఆడడం కూడా మాకు కలిసి వస్తుందని నమ్ముతున్నామని అన్నాడు. 'గత కొన్ని నెలలుగా మెగా టోర్నీకోసం మా జట్టు సన్నాహకాలు అద్భుతంగా సాగుతున్నాయి. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది జట్టును గెలిపించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మా స్క్వాడ్‌లో అనుభవంతో పాటు ప్రతిభావంతులైన కుర్రాళ్లకు చోటిచ్చాం. గ్రూప్ దశలో మెరుగైన ప్రదర్శనతో ముందంజ వేస్తామనే నమ్మకముంది' అని కుక్ వెల్లడించాడు.

**నెదర్లాండ్స్ స్క్వాడ్ :** స్కాట్ ఎడ్వర్డ్స్(కెప్టెన్), కొలిన్ అకెర్మన్, నోహ్ క్రొఎస్, బస్ డి లీడే, ఫ్రెడ్ క్లాసెన్, కైలీ క్లెయిన్, మేఖైల్ లెవిట్, జాచ్ లయన్ కాచెట్, మ్యాక్స్ డోవ్డ్, లోగన్ వాన్ బీక్, టిమ్ వాన్ డెర్ గుట్గెన్, రోలొఫ్ వాన్‌డర్ మెర్వే, పాల్ వాన్ ముకెర్న్, సాఖిబ్ జుల్ఫికర్.



యూరోపియన్ క్వాలిఫయర్స్‌లో అదరొట్టిన నెదర్లాండ్స్ టీ20 ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధింది. ఇదే క్వాలిఫయర్స్‌లో సంచలన ఆటతో ఇటలీ తొలిసారి మెగా టోర్నీ బెర్తు సాధించింది. గ్రూప్ ఏలో ఉన్న డచ్ జట్టు లీగ్ దశలో భారత్, నమీబియా, యూఎస్ఏ, పాకిస్థాన్‌తో తలపడనుంది. ఫిబ్రవరి 7న కొలంబోలో పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది ఎడ్వర్డ్స్ బృందం

### ఆస్ట్రేలియాకు బిగ్ షాక్..
### హఠాత్తుగా వీడ్కోలు పలికిన కెప్టెన్..!

ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలీసా హీలీ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. పదహారేళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతున్నట్టు ఆసీస్ సారథి ప్రకటించింది. స్వదేశంలో త్వరలో భారత జట్టులో సిరీస్ తర్వాత అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతానని మంగళవారం అలీసా వెల్లడించింది. పొట్టి ప్రపంచకప్ కోసం ఆస్ట్రేలియా సన్నద్ధమవుతున్నందున తాను టీమిండియాతో జరుగబోయే టీ20 సిరీస్‌లో మాత్రం ఆడబోనని ఆమె స్పష్టం చేసింది. ఆసీస్ దిగ్గజ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ మేనకోడలైన అలీసా హీలీ 19 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. 2010లో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో తను తొలి మ్యాచ్ ఆడింది. వికెట్ కీపర్‌గా, విధ్వంసక ఓపెనర్‌గా జట్టులో సుస్థిర స్థానం సంపాదించుకున్న హీలీ మూడేళ్ల క్రితం కెప్టెన్సీ చేపట్టింది. మేగ్




లానింగ్ వీడ్కోలు పలికిన తర్వాత బాధ్యతలు చేపట్టిన తన.. యాషెస్ సిరీస్‌లో 16-0తో ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయాల రికార్డు నెలకొల్పింది. హీలీ సారథ్యంలో ఆస్ట్రేలియా టీ20 ప్రపంచకప్‌లో, నిరుడు భారత్‌లో ముగిసిన వన్డే వరల్డ్‌కప్‌లో సెమీస్ చేరింది. ఈ 16 ఏళ్లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటివరకూ ఈ వెటరన్ బ్యాటర్ 162 టీ20లు, 126 వన్డేలు, 11 టెస్టులు ఆడింది. వికెట్ల వెనకాల చురుకుగా కదులుతూ టీ20ల్లో 126 మందిని ఔట్ చేసింది.

### భారత్‌లో ఆడకూడదనే మీ నిర్ణయాన్ని మార్చుకోండి.. బీసీబీని అభ్యర్థించిన ఐసీసీ..!




భారత్‌లో త్వరలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఆడడంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఐసీసీ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని బీసీసీఐ స్పష్టం చేయడంతో వేదిక మార్పు తప్పదేమో? అనిపించింది. కానీ, ఇండియాలోనే ప్రపంచకప్ ఆడేలా బంగ్లాదేశ్ బోర్డును ఒప్పించేందుకు ఐసీసీ పావులు కదుపుతోంది. ఈ మేరకు భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమనే నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఐసీసీ తమను కోరిందని మంగళవారం బీసీబీ వెల్లడించింది. టీ20 ప్రపంచకప్ కోసం ఇండియాకు తమ జట్టును పంపబోమని బంగ్లాదేశ్ బోర్డు తేల్చి చెప్పిన నేపథ్యంలో ఐసీసీ రంగంలోకి దిగింది. ఎలాగైనా బీసీబీ తమ నిర్ణయాన్ని మార్చుకునేలా చేసేందుకు ప్రయత్నిస్తోంది. మంగళవారం బీసీబీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది ఐసీసీ. 'ఈ సందర్భంగా ఇదివరకు చెప్పినట్టుగానే భద్రతా కారణాల రీత్యా భారత్‌కు తమ జట్టును పంపబోమని బంగ్లాదేశ్ బోర్డు చెప్పింది. భారత్‌లో కాకుండా ఇతర దేశాల్లో తమ జట్టు మ్యాచ్‌లు నిర్వహించాలని ఐసీసీ కోరింది. అయితే.. ఐసీసీ మాత్రం అందుకు సిద్ధంగా లేదనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించినందున నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరింది. అయితే.. మా బోర్డు సభ్యులం మాత్రం అందుకు అంగీకరించలేదు. అయితే.. పరిష్కారం లభించేంతవరకూ చర్చలు జరపాలని ఐసీసీ, బీసీబీ అనుకుంటున్నాయి. బంగ్లా క్రికెటర్ల భద్రతకు బీసీబీ కట్టుబడి ఉంది. ఈ విషయమై అధికారులు, సిబ్బంది ఐసీసీతో సంప్రదింపులు జరుపుతున్నారు' అని బీసీబీ తెలిపింది.

**మా పరిధిలో లేనిది**

'ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం మా జట్టును ఇండియా పంపించమ'ని ఐసీసీకి బంగ్లా బోర్డు లేఖ రాయడంతో మొదలైన సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. ఐసీసీ జోక్యం చేసుకుంటుందా? లేదంటే శ్రీలంకలో బంగ్లా జట్టు మ్యాచ్‌లు ఆడిపిస్తారా? అనేది తెలియడం లేదు.ఈ నేపథ్యంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కీలక వ్యాఖ్యలు చేశాడు. తమకు ఐసీసీ నుంచి ఎలాంటి సమాచారం అందలేదని అన్నాడు. 'టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు మ్యాచ్‌ల వేదికల మార్పు గురించి ఐసీసీ నుంచి మాకు ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం అందలేదు.

ధర్మఘంట




# ‘మన శంకరవరప్రసాద్ గారు‘ ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటన

చిరంజీవి- అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ‘మన శంకరవరప్రసాద్ గారు‘ సినిమా ఫస్ట్ డే కలెక్షన్స్ ప్రకటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదలైన ఈ మూవీ పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. ఇందులో చిరంజీవితో పాటు వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా, సచిన్ ఖేడ్కేర్ తదితరులు నటించారు. ఈ మూవీని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. భోళా శంకర్ వంటి డిజాస్టర్ తర్వాత చిరుకు భారీ హిట్ పడిందని ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ‘మన శంకరవరప్రసాద్ గారు‘ ప్రీమియర్స్‌తో కలిపి ఫస్ట్ డే భారీ కలెక్షన్స్ రాబట్టింది. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 84కోట్లు రాబట్టినట్లు చిత్ర నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ ప్రకటించింది. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే రెండో అతిపెద్ద ఓపెనింగ్ చిత్రంగా ‘మన శంకరవరప్రసాద్ గారు‘ నిలబడింది. ‘సైరా నరసింహా రెడ్డి‘ చిత్రానికి మొదటిరోజు రూ. 85 కోట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఖైదీ నంబర్ 150‘కి (రూ. 51 కోట్లు), వాల్తేరు వీరయ్య (రూ. 49.10 కోట్లు), గాడ్ ఫాదర్ (రూ. 32.70 కోట్లు), ఆచార్య ( రూ. 52 కోట్లు), భోళా శంకర్ (రూ. 28 కోట్లు) వచ్చాయి.




# 100 ఎకరాల పొలం కావాలి.. నటులు మాత్రం వద్దు

## మీనాక్షి చౌదరి కండీషన్స్ వైరల్

టాలీవుడ్‌లో “లక్కీ హీరోయిన్”గా పేరు తెచ్చుకున్న అందాల భామ మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ జోష్‌లో కొనసాగుతోంది. గత ఏడాది సంక్రాంతికి విడుదలైన ‘వస్తున్నాం’ సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, ఇప్పుడు మరోసారి పండగ సీజన్‌ను టార్గెట్ చేస్తోంది. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం ‘అనగనగా ఒక రాజు’ తో ఈసారి కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రమోషన్స్‌లో మీనాక్షి చౌదరి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ముఖ్యంగా ప్రీ రిలీజ్ ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో ఆమె మాట్లాడిన సరదా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనకు కాబోయే భర్త గురించి మాట్లాడిన మీనాక్షి చౌదరి, కొన్ని ఆసక్తికరమైన ‘కండిషన్స్’ పెట్టి అందరినీ నవ్వులు పూయించింది. తన భర్త డాక్టర్, నటుడు లేదా మిస్టర్ ఇండియా మాత్రం అసలు కాకూడదని స్పష్టం చేసింది. తాను ఇప్పటికే సినిమా రంగంలో ఉన్నానని, ఇంట్లో మరోసారి అదే ప్రొఫెషన్ అవసరం లేదని చమత్కారంగా వ్యాఖ్యానించింది. అంతేకాదు, తన జీవిత భాగస్వామికి 100 ఎకరాల పొలం ఉండాలి అంటూ చెప్పిన మాటలు ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయం, పల్లెటూరి వాతావరణం అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఇక ఇంటి పనుల విషయంలో కూడా మీనాక్షి తన స్టైల్‌లో కండిషన్స్ పెట్టింది. వంట చేయడం, బట్టలు ఉతకడం, ఐరన్ చేయడం వంటి పనులు రావాలని చెప్పి నవ్వులు పూయించింది. అబ్బాయికి గతంలో బ్రేకప్స్ ఉన్నా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే పొడవుగా ఉండాలని మాత్రం కచ్చితంగా చెప్పింది. రోజుకు రెండు మూడు సార్లు లవ్ ప్రపోజ్ చేస్తూ, గిఫ్ట్ ఇచ్చే వ్యక్తే తన “రాజు” అంటూ సరదాగా పేర్కొంది. ఇటీవల కొంతకాలంగా మీనాక్షి చౌదరికి టాలీవుడ్ హీరోలతో ప్రేమాయణం ఉందంటూ పలు రూమర్స్ వినిపించాయి. అయితే వాటన్నింటినీ ఆమె ఖండిస్తూ, పూర్తిగా అబద్ధమని కొట్టి పారేసింది. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ సినిమాలపైనే ఉందని స్పష్టం చేసింది. ‘అనగనగా ఒక రాజు’ సినిమాతో పాటు మీనాక్షి చౌదరి ఇతర భాషల్లోనూ బిజీగా ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ నటిస్తున్న 63వ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే తమిళంలో ‘వృషకర్మ’ అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది.

# నాలుగు రోజుల్లో రూ.200 కోట్లు.. ‘ది రాజాసాబ్’ రికార్డు కలెక్షన్స్!

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ‘ది రాజాసాబ్’మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చినా.. బాక్సాఫీస్ వద్ద మాత్ర భారీ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. తొలి రోజే రూ. 112 కోట్లు వసూలు చేసిన ‘రాజాసాబ్’... నాలుగు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సాధించింది. ఈ మేరకు మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ఈ రేంజ్‌లో కలెక్షన్స్ రాబట్టడం చూసి ట్రేడ్ వర్గాలు షాకవుతున్నాయి. అయితే ప్రభాస్ స్థాయికి ఈ కలెక్షన్స్ తక్కువే కానీ.. పోటీలో చిరంజీవి లాంటి సినిమాలు ఉన్నప్పటికీ ఈ స్థాయిలో రావట్టడం గొప్ప విషయం. మారుతి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పిపుల్ మీడియా ఫ్యాక్టర్ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటించారు. సంక్రాంతి కానుకగా ఈ నెల 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హాలీడేస్ సీజన్ లో ఫస్ట్ వీక్ “రాజా సాబ్“ హ్యూజ్ నెంబర్స్ క్రియేట్ చేస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.




# భాషతో సంబంధం లేదు.. నచ్చితే ఓకే చెప్తా కల్యాణి ప్రియదర్శన్

ఇటీవల ‘లోకా: ఛాప్టర్ 1 – చంద్ర‘ చిత్రంతో అదిరిపోయే విజయాన్ని అందుకున్న నటి ‘కల్యాణి ప్రియదర్శన్‘. అందులో సూపర్ హీరో పాత్రలో నటించి మలయాళంతో పాటు, తమిళం తెలుగు, ప్రేక్షకులను అలరించారు. అంతేకాకుండా మాతృభాషతో పాటూ తెలుగు, తమిళం భాషల్లో కథానాయికిగా నటిస్తూ బిజీగా ఉన్న ఈ బ్యూటీ తాజాగా బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా ఇటీవల ఈ అమ్మడు ఒక భేటీలో పేర్కొంటూ లోకా చిత్రం తరువాత తనకు పలు భాషల్లో పలు అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. అయితే మంచి పాత్ర అని అనిపిస్తే నటించడానికి సిద్ధమని పేర్కొన్నారు. మరాఠీ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళ భాషలను తాను ఎప్పుడు వేర్వేరుగా చూడనన్నారు. కథ చెప్పడం అన్నది ప్రపంచ భావోద్వేగం అన్నారు. ఒక మంచి కథలో నటించే అవకాశం వస్తే పూర్తి సమయాన్ని కేటాయించి, మనసుపెట్టి నటించడానికి తాను ఎప్పుడు సిద్ధమే అన్నారు. కాగా ఈమె రవి మోహన్ సరసన నటించిన జీనీ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా ప్రస్తుతం కార్తీ కి జంటగా మార్షల్ చిత్రంలో నటిస్తున్నారు. మరిన్ని చిత్రాలు తన కోసం ఎదురుచూస్తున్నట్లు తనుస్వయంగా చెప్పారు. అదేవిధంగా తనకు సూపర్ హీరో ఇమేజ్ తెచ్చిపెట్టిన లోకా చిత్రానికి పార్ట్ 2 కూడా ఉంది. ఇందులో కూడా ఆమె నాయకగా నటించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



# బాలీవుడ్‌లో హద్దులు దాటుతున్న పీఆర్ వ్యూహాలు

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పబ్లిసిటీ సంస్కృతిపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్రమోషన్ అనేది కేవలం తమ సినిమా గురించి మాట్లాడటానికే పరిమితం కాకుండా, ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని పీఆర్ టీమ్స్ తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఇతర నటులు, సినిమాలపై నెగటివ్ కథనాలు ప్లాంట్ చేస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ కాదు, పూర్తిగా తప్పుదారి పట్టిన విధానం” అని వ్యాఖ్యానించారు. సినిమా కంటెంట్, నటన, కథ బలం గురించి మాట్లాడాల్సిన చోట, వ్యక్తిగత విమర్శలు లేదా ఇతరులపై నిందలు వేయడం ట్రెండ్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి పీఆర్ గేమ్స్‌లో తాను ఎప్పుడూ భాగం కాలేదని తాప్సీ స్పష్టం చేశారు. నేను అలాంటి వ్యూహాలకు దూరంగా ఉండటం పట్ల చాలా రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా పని నా సినిమాల ద్వారా మాట్లాడాలని నమ్ముతాను. ఇతరులను కిందకు లాగి పైకి రావడం నాకు ఇష్టం లేదు అని ఆమె తెలిపారు. ఈ మాటలు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. తాప్సీ వ్యాఖ్యలు బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం స్టార్ ఇమేజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, వైరల్ కథనాలే సినిమాల భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న సమయంలో, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పీఆర్ వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108


ధర్మఘంట

# రంగుల్లో ప్రతిఫలించిన సంక్రాంతి సంస్కృతి

**ధర్మఘంట జనవరి 13**

మోత్కూరు:సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రజాభారతి సాహితీ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోత్కూరు మండల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని మినీ స్టేడియం మైదానంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఘనంగా ముగిశాయి.మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల ముగ్గులతో తమ సృజనాత్మకతను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనమని అన్నారు.మహిళలు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని దేశభక్తి,రైతు గొప్పదనం,నైతిక విలువలను ప్రతిబింబించే విధంగా రూపొందించిన ముగ్గులతో తమ భావాలను అద్భుతంగా వ్యక్తపరిచారని ప్రశంసించారు.మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నూనెముంతల విమలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలని,సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు స్థానిక వ్యాపారవేత్త పల్లెర్ల వెంకన్న కళ్యాణిల సౌజన్యంతో నగదు పురస్కారాలు అందజేశారు. ప్రథమ బహుమతిగా ఐదు వేల రూపాయలను ముగ్గురికి,





ద్వితీయ బహుమతిగా మూడు వేల ఐదు వందల రూపాయలను ముగ్గురికి,తృతీయ బహుమతిగా రెండు వేల ఐదు వందల రూపాయలు,నాలుగవ బహుమతిగా వెయ్యి ఐదు వందల రూపాయలను ముగ్గురికి,పంచమ బహుమతిగా వెయ్యి రూపాయలను ముగ్గురికి అందించారు.అదేవిధంగా ప్రోత్సాహక బహుమతులుగా స్థానిక కళ్యాణలక్ష్మి షాపింగ్ మాల్ యజమాని అల్లాడి సోమేశ్వర్ సౌజన్యంతో ఇరవై ఐదు మందికి జ్ఞాపిక చీరలు అందజేశారు.ఈ సందర్భంగా వ్యాసరచన,పాటల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాలు అందించడంతో కార్యక్రమం పండుగ వాతావరణంలో ఉత్సాహంగా ముగిసింది.ప్రజాభారతి అధ్యక్షుడు బోళ్ళ హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్యని వెంకటేశ్వర్లు,రెడ్ క్రాస్ మోత్కూరు మండల శాఖ అధ్యక్షుడు ఓ.సత్యానాథ్,స్థానిక సీఐ వెంకటేశ్వర్లు,గుండెగోని రామచంద్రు,అవిలిమల్లు, ప్రజాభారతి సభ్యులు దేవినేని అరవిందరాయుడు,గుమిడెల్లి వెంకన్న,గాద వెంకటేశ్వర్లు, వారాల యాదగిరి,ఇ.రాంప్రసాద్, మర్రి జయశ్రీ,టీ.ఉప్పలయ్య, దర్శనం వెంకన్న,బయ్యని రాజు, మోత్కూరు సుజాత,అన్నెపు పద్మ,మాజీ ఎంపీటీసీ సభ్యులు కోల ప్రమీల,ముద్దం జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ధర్మఘంట జనవరి 13**

మంచిర్యాల:ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి,నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.మంగళవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు,విద్యుత్,విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు,ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం,నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం బెల్లంపల్లి పట్టణంలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్,జిల్లా





వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు వ్యవసాయ పనిముట్లు, పరికరాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని వినూత్న సంస్కరణలతో అభివృద్ధి చేసేందుకు పంట సాగుకు అవసరమైన వ్యవసాయ అధునాతన పరికరాలను అర్హులైన రైతులకు అందించి పంట దిగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ క్రమంలో వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమం ఎస్ఎంఎఎం 2025- 26 లో భాగంగా అర్హులైన రైతులకు యాంత్రికరణ పరికరాలను అందించడం జరిగిందని తెలిపారు.అనంతరం

బెల్లంపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతులు అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా లబ్ధి పొందేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కార్యక్రమంలో ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్

**మోత్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ సి.వెంకటేశ్వర్లు**

**ధర్మఘంట జనవరి 13 మోత్కూర్:**

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడమే ఎక్కువ ప్రమాదాలకు ప్రధాన కారణమని మోత్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించటం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు.అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రాణాంతకమని హెచ్చరించారు .ప్రతి వాహనదారుడు బాధ్యతతో వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యం కూడా ఎలా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందో ఉదాహరణలతో వివరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎదురయ్యే వైద్య ఖర్చులు,శారీరక ఇబ్బందులు, కుటుంబాలపై పడే మానసిక ఒత్తిడి,ఆర్థిక భారం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.సురక్షిత డ్రైవింగ్ పద్ధతులు,ప్రమాదం

## కాంగ్రెస్ సేవాదళ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం






**ధర్మఘంట, జనవరి 11, సూర్యాపేట:**

తెలంగాణా రాష్ట్ర ఇరిగేషన్ మరియు సివిల్ సప్లైస్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, ఏఐసీసీ సభ్యులు టైగర్ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు, తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ కొప్పుల వేణారెడ్డి మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ ఆదేశాల మేరకు, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య మరియు సూర్యాపేట జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బైరు శైలేందర్ గౌడ్ సూచన మేరకు నేడు కాంగ్రెస్ సేవాదళ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఆలేటి మాణిక్యం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట నియోజక వర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గంపల శాంతి కుమార్, సూర్యాపేట మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు ఉయ్యాల సైదులు, ఆత్మకూర్ మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నాయిని రాంమూర్తి, పెన్పహాడ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గోపాల్, జాజిరెడ్డి గూడెం మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గిరి బాబు, చివ్వేంల మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మంగ్తా నాయక్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శులు రాములు నాయక్, నగేష్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు మోహన్, వెంకటేశం, తదితర కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు పాల్గొన్నారు

## మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు

**హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**





**ధర్మఘంట జనవరి 13**

భువనగిరి:మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మంగళవారం చౌటుప్పల్ పురపాలక సంఘం నందు వార్డు ఆఫీసర్లకు,బిల్ కలెక్టర్లకు మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ నందు ప్రాథమిక వసతుల కల్పన ముఖ్యమైనదని,మంచినీటి, విద్యుత్,వెంటిలేషను,కిటికీలు,డోర్స్,టాయిలెట్ ఫెసిలిటీస్, ర్యాంపు మొదలైన వసతులు సరిగా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు. ఎలక్షన్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్క ఉద్యోగి సక్రమంగా పనిచేయాలని,సెలవులు పెట్టకూడదని తెలిపారు.ప్రతి ఉద్యోగి ఏ రాజకీయ పక్షానికి అనుకూలంగా వ్యవహరించకూడదని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈరోజు డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ ల వివరాలను విడుదల చేయనైనదని కమిషనర్ అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య,సీనియర్ అసిస్టెంట్ దీప,రఘుపతి,వార్డ్ ఆఫీసర్లు,బిల్ కలెక్టర్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు..

**మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి..**



మకరరాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే మకర సంక్రాంతి ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండి సుఖశాంతులతో జీవించాలని మాజీమంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయన భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ఈ పండగలను జరుపుకోవాలన్నారు. ప్రధానంగా ఈ పండగ సందర్భంగా బోగిమంటలు, పతంగులు ఎగురవేసే ప్రతి ఒకరు జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని సూచించారు.

## భూ భారతి రెవిన్యూ సదస్సుల దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ధర్మఘంట జనవరి 13**



భువనగిరి:భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూసమస్యల దరఖాస్తులు పెండింగ్ లేకుండా పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం బీబీనగర్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి పెండింగ్,రిజిస్ట్రేషన్ దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా బీబీనగర్ మండలంలోని ఒక్కో గ్రామం వారీగా పెండింగ్ లో ఉన్న భూభారతి రిజిస్ట్రేషన్ దరఖాస్తులను ఎలా పరిష్కరించాలనే విషయాలపై మార్గనిర్దేశం చేశారు.భూ సమస్యలపై భూ భారతిలో చేసుకున్న దరఖాస్తులను పాత రికార్డుల ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూడాలన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలన్నారు.అర్జీలను తిరస్కరించినట్లైతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. చిన్నచిన్న కారణాలతో అర్జీలను తిరస్కరించకూడదన్నారు.ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా,పూర్తి పారదర్శకంగా వ్యవహరించాలని, భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల తాహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో 9572 ఉద్యోగాలు భర్తీ చేశాం

**మరో 7267 ఉద్యోగాల భర్తీ చివరి దశలో ఉంది**
**త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు ఇస్తాం**
**ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రతి పోస్టునూ రిక్రూట్ చేస్తాం**
**ప్రతి పౌరునికి మెరుగైన వైద్య సేవలు అందిస్తాం**
**ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన 1257 మంది**
**నియామక పత్రాల అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహా**



**ధర్మఘంట జనవరి 13 హైదరాబాద్:**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో మరో భారీ నియామక ప్రక్రియ పూర్తయింది. ఒకేసారి 1,257 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు (గ్రేడ్-2) నియామక పత్రాలను అందజేసే బృహత్తర కార్యక్రమం మంగళవారం కోటిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌లతో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా వేగంగా ఈ నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు.2024 సెప్టెంబర్ 11న నోటిఫికేషన్ విడుదల చేయగా,2025 నవంబర్ నాటికి నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. మొత్తం 23,323 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 1257 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.డీఎంఈ పరిధిలో 764,డీపీహెచ్‌లో 300, టీవీవీపీలో 180,ఎంఎన్‌జే లో 13 మందికి పోస్టింగ్స్ ఇచ్చామన్నారు.ఒకప్పుడు రోగి లక్షణాలను బట్టి వైద్యం చేసేవారని,కానీ,నేడు రోగ నిర్ధారణ జరిగిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారని,ల్యాబ్ టెక్నీషియన్లు ఇచ్చే రిపోర్టులే డాక్టర్లకు ప్రామాణికమని,వైద్య వ్యవస్థకు మీరు కళ్లు,చెవుల్లాంటి వారని,మీ రిపోర్టుల్లో కచ్చితత్వం ఎంతో ముఖ్యమని,ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ల్యాబ్ టెక్నీషియన్లు తీసుకోవాలని సూచించారు.

### రెండేళ్లలో 9572 ఉద్యోగాల భర్తీ

నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండేళ్లలో 70 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు.ఒక్క ఆరోగ్య శాఖలోనే ఇప్పటివరకు 9,572 పోస్టులను భర్తీ చేశామని, మరో 7,267 పోస్టుల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందన్నారు.ఆర్థిక శాఖ అనుమతి ఉన్న మరో 996 పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని,అదనంగా 2,344 పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని స్పష్టం చేశారు.

### ఆరోగ్య తెలంగాణ లక్ష్యం

తెలంగాణను ఆరోగ్య రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి పేర్కొన్నారు.ఉస్మానియా నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు,ప్రతీ జిల్లాలో ఎన్‌సీడీ క్లినిక్స్,క్యాన్సర్ డే కేర్ సెంటర్లు,ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్స్,గాంధీ ఆసుపత్రిలో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు.తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్‌గా మారుస్తున్నామని మంత్రి వెల్లడించారు.త్వరలోనే నూతన హెల్త్ పాలసీని రూపొందించి, అమలు చేయబోతున్నామని తెలిపారు.ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న ఆరోగ్య శాఖను సీఎం రేవంత్ రెడ్డి తనకు ఇచ్చారని,ఈ శాఖకు మంత్రిగా ఉన్నందుకు తనకు చాలా ఆనందంగా ఉందని మంత్రి వెల్లడించారు.

ధర్మఘంట

# రేపాల మండల సాధనకు కదలిరండి

తెలంగాణ రాష్ట్రంలో పాత,కొత్త మండలాలు,రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా కసరత్తు ప్రారంభిస్తున్నట్లు సంకేతాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుండి అనేక డిమాండ్లు వస్తున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తుల తో ఒక కమిషన్ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి వాస్తవాలను తెలుసుకొని,అవసరమున్న చోట చేర్పులు మార్పులు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని రేపాల రెవిన్యూ గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని నూతన గ్రామీణ మండల సాధన కోసం గతంలో ఆ ప్రాంత ప్రజలు చేసినటువంటి ప్రయత్నం మళ్లీ పునర్జీవింప చేసుకొనే అవకాశం వచ్చింది.మళ్ళీ రేపాల మండల సాధన కోసం కార్యాచరణ రూపొందించుకొని,ఉద్యమ బాట పట్టాల్సిన సమయం ఆసన్నమైంది.క్షేత్రస్థాయి పరిశీలన కోసం వచ్చే కమిటీ దృష్టికి ఈ ప్రాంత ప్రజల డిమాండ్ నూతన మండల ఏర్పాటు అనే విధంగా,వారికి ఇక్కడి పరిస్థితులు కనిపించేలా గతంలో చేసిన పోరాట రూపాలను తిరిగి అందిపుచ్చుకొని అడుగులు వేసేందుకు సిద్ధమవ్వాలి. సూర్యాపేట జిల్లా కోదాడ రెవిన్యూ డివిజన్ పరిధిలోని మునగాల మండలంలో 22 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. అందులో 11 గ్రామాలు పూర్తిగా కెనాల్ కింద ఉండగా,మిగతా 11 గ్రామాలు పూర్తిగా నాన్ కెనాల్ కింద ఉన్నాయి.నాన్ కెనాల్ ప్రాంతంలో ఉన్నటువంటి మద్రి, ఈదులవాగుతండా, వెంకట్రామాపురం, తాడువాయి,కలకోవ,విజయరాఘవాపురం,మాధవరం,రేపాల, సీతానగరం,నరసింహులగూడెం,జగన్నాధపురం గ్రామాలు ఏళ్ల తరబడి వివక్షకు గురవతూ వెనుకబడిన ప్రాంతాలుగా మిగిలిపోయాయి. అంతే కాకుండా మునగాల మండల కేంద్రం నాన్ కెనాల్ గ్రామాలకు 10 నుండి 20 కి. మీ.దూరంలో ఉండడం,కనీస రవాణా సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. రేపాలలో అన్నిరకాల ప్రభుత్వ సంస్థలు ఉన్నా రెవిన్యూ,పోలీస్, పంచాయితీ రాజ్ (మండల పరిషత్) పనుల కోసం మండల కేంద్రం మునగాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.ఈ పరిస్థితి మారాలంటే రేపాల కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయకతప్పదు.దీని కోసం అన్ని గ్రామాల నూతన పంచాయతీ పాలకవర్గాలు ప్రత్యేక తీర్మానాలు చేసి,మండల తహసిల్దార్ నుండి జిల్లా కలెక్టర్ వరకు,అదేవిధంగా నియోజకవర్గ ఎమ్మెల్యే,జిల్లా మంత్రికి కూడా పరిస్థితులను వివరిస్తూ వినతిపత్రాలు అందజేస్తే,ఈ ప్రాంత ప్రజల యొక్క డిమాండ్





సజీవంగా రికార్డుల్లో ఉండే అవకాశం ఉంటుంది.క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే కమిటీకి ఇక్కడి పరిస్థితులు వివరించేందుకు అన్ని గ్రామాలకు సంబంధించిన సర్పంచులు,మేధావులు, రాజకీయ నాయకులు దీనిపై సీరియస్ గా ఆలోచన చేయాలి. ఈ అవకాశం చేజారితే మళ్ళీ రావడం కష్టతరం అవుతుంది. అందుకే ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక మేరకు అన్ని పార్టీల రాజకీయనాయకులు రేపాల మండల సాధన కొరకు ఒక్కటీగా అడుగులు వేయాలి. ఒకవేళ పునర్విభజనలో భాగంగా స్థానిక ప్రజల కోరిక మేరకు నేలమర్రి,ఈదుల వాగుతండా పెన్ పహాడ్ మండలంలో విలీనం చేసినా, వెంకటరామపురం,తాడువాయి గ్రామాలను మునగాల మండలంలోనే ఉంచినా,రేపాలకు అతి సమీపంలో ఉన్న మోతె మండలంలోని నామవరం, రాఘవపురం,నడిగూడెం మండలంలోని కేశవాపురం గ్రామాలను రేపాల మండలంలో కలిపే అవకాశం ఉంటుంది.ఈ విషయాన్ని ఈ గ్రామాల బాధ్యులు ఆయా గ్రామాల పెద్దలకు అర్థమయ్యే విధంగా వివరించాల్సి ఉంటుంది.అదే జరిగితే కేశవాపురం, నరసింహులగూడెం, జగన్నాథపురం, సీతానగరం, రాఘవాపురం, నామవరం,మాధవరం,విజయరాఘవాపురం,కలకోవ మరియు రేపాల గ్రామ పంచాయితీలను కలుపుకొని రేపాల మండల కేంద్రంగా రూరల్ మండలం ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది.ఈ 10 గ్రామ పంచాయతీలతో ఇది జిల్లాలో చాలా మండలాల కంటే పెద్ద మండలంగా అవతరించే అవకాశం ఉంది.(నేలమర్రి వెంకటరాంపురం ఈ మండలంలో ఉండడానికి అనుకూలంగా ఉంటే ఇంకా మంచిది)ఈ గ్రామాలకు లింక్ రోడ్లు అనుసంధానం చేస్తే సుమారు 10 నుంచి 15 నిమిషాల జర్నీ మాత్రమే ఉంటుంది.ప్రస్తుతం మునగాల మండలంలో అతిపెద్ద రెవెన్యూ కలిగినటువంటి ప్రాంతం రేపాల రెవిన్యూ,ఇప్పటికే రేపాలలో పరిసర ప్రాంత ప్రజలకు కావలసిన అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.మండలంగా ఆవిర్భవిస్తే ఈ ప్రాంతంలో అన్నిరకాల వ్యాపార,వాణిజ్య, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.రియల్ ఎస్టేట్ ఊపందుకొని భూముల రేట్లు పెరుగుతాయి.మొత్తం నాన్ కెనాల్ ఏరియా కాబట్టి ప్రత్యేక మండలంగా చూస్తూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల ద్వారా ఈ ప్రాంత చెరువులను నింపి,సాగు నీరు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అప్పటివరకు కరువు మండలంగా ప్రకటించే అవకాశం ఉంటుంది.కొత్తగా ఏర్పడే మండలానికి ప్రత్యేక ఎన్నికల బాడీ ఉంటుంది కాబట్టి,రాజకీయ నిరుద్యోగులకు కూడా పదవుల అవకాశాలు మెరుగవుతాయి.ఈ ప్రాంత బిడ్డలే ఇక్కడ ఎంపీపీగా, సర్పంచులుగా,ఎంపీటీసీలుగా,జడ్పిటిసిగా ఉంటారు కాబట్టి, మండలానికి కావలసిన నిధులను తెచ్చుకోవడంలో ఈ గ్రామాలను అభివృద్ధి చేసుకోవడంలో ఎంతో కొంత ఉపయోగం ఉంటుంది.అదే విధంగా ఈ ప్రాంత ప్రజలకు అన్నిరకాల ప్రభుత్వ శాఖలు కాలినడక దూరంలో అందుబాటులోకి వస్తాయి. తద్వారా రవాణా,సమయం, ఖర్చు ఇవన్నీ కూడా ప్రజలకు ఆదా అవుతాయి.ముఖ్యంగా విద్యారంగం,వైద్యరంగం అభివృద్ధి చెందుతుంది.ఏ రకంగా చూసుకున్నా రేపాల మండలంగా ఏర్పడడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు అన్ని వర్గాల వారికి ఉపయోగమే తప్ప ఎటువంటి నిరుపయోగం లేదు.ఇకనైనా నాన్ కెనాల్ ప్రాంతంలో ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచులు సమిష్టిగా బాధ్యతలు తీసుకొని, పార్టీలకతీతంగా రేపాల మండల సాధన సమితిని భుజస్కందాలపై వేసుకొని ముందుకు నడిపించి, ఈ ప్రాంత ప్రజల తరాల నుండి వేధిస్తున్న వెనుకబాటు తనానికి విముక్తి కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.

# 645 ఇండ్లను బ్లాక్ లిస్టు నుండి తొలగించాలని బీఆర్ఎస్ నిరసన

**మోత్కూర్ ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత**

**ధర్మఘంట జనవరి 13 మోత్కూర్:**


యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో 645 ఇళ్లను బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ముందు నిరసనకు దిగారు.వెంటనే ఈ ఇళ్లను బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించాలని తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపాలిటీలో ఇళ్లను ప్రభుత్వ భూములుగా గుర్తించి బ్లాక్‌లిస్ట్‌లో చేర్చడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ నిర్ణయం వల్ల పట్టణంలో ఇళ్ల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయి,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,గత 6070 సంవత్సరాలుగా నివాసాలు ఉంటూ,చట్టబద్ధంగా ఇళ్లు ఏర్పాటు చేసుకున్న వాటిని కూడా ప్రభుత్వ భూములుగా గుర్తించడం ఏమిటని ప్రశ్నించారు.ప్రొవిజన్ లిస్ట్‌లో చేర్చడం వల్ల అత్యవసర సమయాల్లో ఇళ్లు అమ్ముకునే అవకాశం లేక ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొన్ని వ్యవసాయ భూములను కూడా ప్రభుత్వ భూములుగా చూపించడం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యాలు



అనుమానాస్పదంగా ఉన్నాయని, ఈ చర్య కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే చేపట్టిందని ఆరోపించారు.పట్టణ ప్రజల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని,అన్యాయంగా బ్లాక్‌లిస్ట్‌లో చేర్చిన ఇళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులు కూడా తహసిల్దారును నిలదీయడంతో ఈ విషయంపై స్థానిక తహసిల్దార్ జ్యోతి స్పందిస్తూ ఇది రాష్ట్ర స్థాయి విధానంలో భాగమేనని, ప్రభుత్వ భూములను పరిరక్షించడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు.అయితే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చడంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగాయని నిర్ధారణ అయితే,సంబంధిత వ్యక్తులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు జంగ శీను, పొన్నబోయిన రమేష్,మాజీ మార్కెట్ చైర్మన్లు చిప్పలపల్లి మహేంద్రనాథ్,కొణతం యాకుబ్ రెడ్డి,దాసరి తిరుమలేష్,మద్రి అనిల్,గజ్జి మల్లేష్,బయ్యని పిచ్చయ్య,పురుగుల మల్లయ్య, మంచి గోవర్ధన్,వెంకన్న,చదరాశి వెంకన్న,దాసరి నరేష్,గుంటి దేవా,అన్నందాసు విద్యాసాగర్, కోక భిక్షం,భాషబోయిన భిక్షం, మురిగాల రాజు,అన్నందాసు మచ్చగిరి,కొమ్ము సైదులు, సుదగాని వెంకన్న,బందెల శీను, చుక్క అశోక్,మురిగాల రాజయ్య,దాసరి కనకయ్య, కందుకూరి సురేందర్,కోరెళ్ళ సైదులు పాల్గొన్నారు.

## చర్లగూడెం ప్రాజెక్టులో సరదాగా ఈతకు వెళ్లి బాలుడు మృతి

**ధర్మఘంట జనవరి 13**



మర్రిగూడ: చర్లగూడెం ప్రాజెక్టులో సరదాగా ఈతకు వెళ్లి బాలుడు మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని చర్లగూడెం ముంపు గ్రామమైన వెంకేపల్లిలో చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..వెంకేపల్లి గ్రామానికి చెందిన గోగుల అంజయ్య,శారద దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు అక్షయ్ కుమార్(10) మంగళవారం చర్లగూడెం ప్రాజెక్టులో మట్టికోసం తీసిన గుంతలో సరదాగా ఈతకు వెళ్లి గుంతలో పడి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.కుమారుడి మరణంతో గుండెలు పగిలేలా విలపిస్తున్న తీరు గ్రామ ప్రజలను కంటతడి పెట్టించగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కేరళలోని కాలికట్ లో అవార్డు అందుకున్న డెయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్ రావు

**కరీంనగర్ డెయిరీ చైర్మన్ కు అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డ్ -2025**

**ధర్మఘంట జనవరి 13 కరీంనగర్:**

డెయిరీ రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక "అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డ్ 2025 తెలంగాణ" ను కరీంనగర్ డెయిరీకి దక్కింది.క్షీర విప్లవ పితామహుడైన వర్గీస్ కురియన్ జన్మస్థలమైన కేరళ రాష్ట్రం కోజికోడ్లోని కాలికట్ ట్రేడ్ సెంటర్ లో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ వారు 2026 జనవరి 8,9,10 తేదీలలో నిర్వహించిన సదరన్ డెయిరీ మరియు ఫుడ్ కాంక్లేవ్'2026 ప్రొగ్రామ్ లో ఈ అవార్డును అందుకున్నట్లు కరీంనగర్ డెయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్ రావు మంగళవారం కరీంనగర్ డెయిరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు."అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డ్ 2025 తెలంగాణ" అవార్డును కేరళ రాష్ట్ర పశుసంవర్ధక,పాడిపరిశ్రమ శాఖా మంత్రి జె.చించురాణి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఐడిఏ తెలంగాణ చాప్టర్ పరిధిలో "బెస్ట్ వుమెన్ డెయిరీ ఫార్మర్ అవార్డ్" కు కరీంనగర్ డెయిరీ ఏంపిఐ సంగంపెల్లి,జగిత్యాల జిల్లా పాల ఉత్పత్తి దారురాలైన అంకతి రాధ ఎంపికైనట్లు పేర్కొన్నారు."బెస్ట్ వుమెన్ డెయిరీ ఫార్మర్ అవార్డ్" ఎంపికైన అంకతి రాధ రూ.20,000 ల చెక్కు అవార్డు అందుకున్నట్లు వెల్లడించారు.ఈ అవార్డు పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, తమిళనాడు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి మనోతంగరాజు, పుదుచ్చేరి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తిరు సి.డిజెకుమార్, కేరళ ఫెడరేషన్ మార్కెటింగ్ చైర్మన్ కె.ఎస్.మణి,ఐడిఐ చైర్మన్ సుధీర్ కుమార్ సింగ్,కరీంనగర్ డెయిరీ పాలవర్గ సభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

**టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ .సోమయ్య**




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జనవరి 13,(ధర్మ ఘంట) :**

తెలంగాణ రాష్ట్రంలోని సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పొందే విషయంలో మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్. సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని ,టెట్ అర్హత మార్కులను తగ్గించాలని ప్రభుత్వానికి సూచించారు. 2023 జూలైనుండి అమలు కావాల్సిన నూతన పిఆర్సి రిపోర్టును వెంటనే తెప్పించి అమలు చేయాలని ,ఉపాధ్యాయుల రేషనలైజేషన్ సంబంధించి జీవో నెంబర్ 25 ను సవరించి ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తిని 1:15 కు సవరించి 50 మంది విద్యార్థులకు పైన ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఉపాధ్యాయుని నియమించాలని సూచించారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ .అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె .యాకయ్య ,జిల్లా ఉపాధ్యక్షులు పి. శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా కోశాధికారి జి. వెంకటయ్య, జిల్లా కార్యదర్శిలు ఎన్ .నాగేశ్వరరావు ,వి .రమేష్, సిహెచ్. రమేష్ ,డీ లాలు ,ఎం రవీందర్ , జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్ సాంబయ్య , సభ్యులు డి. శ్రీనివాసచారి పాల్గొన్నారు

## మితిమీరిన వేగం ప్రమాదాలకు కారణం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ధర్మఘంట జనవరి 13 మంచిర్యాల:**

రహదారులపై మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని,వాహనం నడిపేటప్పుడు నిర్దేశిత వేగాన్ని పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం మంచిర్యాల జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో తాండూర్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సుకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్,డిసిపి ఎ.భాస్కర్,బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి,మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని,రహదారులపై నిర్దేశిత వేగంతో మాత్రమే వాహనాలను నడపాలని,18 సంవత్సరాల వయసు నిండి అర్హత కలిగిన వారు లైసెన్స్ పొందాలని,వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలలో పట్టుబడితే లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, అయినప్పటికీ వాహనాలు నడిపినట్లయితే సదరు వ్యక్తికి సంబంధించిన లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. జనవరి 24వ తేదీ వరకు రహదారి భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించి,రోడ్డు ప్రమాదాలను నివారించాలని, కుటుంబ సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు.తాండూర్ మండల కేంద్రానికి చెందిన మహిళ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధితురాలి కూతురు స్వాతికి బెల్లంపల్లి ఎమ్మెల్యే రూ.10 వేలు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 2026 సంక్రాంతి

**ధర్మఘంట, జనవరి 13,**



హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 2026 సంక్రాంతి సందర్భంగా అంతర్జాతీయ పతంగుల మరియు మిఠాయిల పండుగ ఘనంగా జరుగుతోంది. ఈ వేడుకలకు సంబంధించిన ప్రధాన వివరాలు ఇక్కడ ఉన్నాయి: తేదీలు: జనవరి 13 నుండి 15, 2026 వరకు. సమయం: ప్రతిరోజూ ఉదయం 10:30 నుండి రాత్రి 10:30 వరకు.

ప్రవేశం: అందరికీ ప్రవేశం ఉచితం. ప్రధాన ఆకర్షణలు: అంతర్జాతీయ పతంగుల ప్రదర్శన: సుమారు 19 దేశాల నుండి వచ్చిన అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్ మరియు దేశీయ నిపుణులు భారీ మరియు విభిన్న ఆకృతులలో ఉన్న పతంగులను ఎగురవేస్తారు. నైట్ ఫ్లయింగ్: రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలతో అలంకరించిన పతంగులను ఎగురవేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మిఠాయిల పండుగ: దాదాపు 1,200 రకాల సాంప్రదాయక మరియు విదేశీ మిఠాయిలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి..హ్యాండ్లూమ్ & హ్యాండీక్రాఫ్ట్: 100కు పైగా చేనేత మరియు హస్తకళల స్టాళ్లతో పాటు 60కి పైగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయబడ్డాయి. సాంస్కృతిక ప్రదర్శనలు: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళలు మరియు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఇతర ప్రత్యేక కార్యక్రమాలు (2026):

హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్: జనవరి 16 నుండి 18 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో సాయంత్రం వేళల్లో రంగురంగుల బెలూన్ షోలు నిర్వహిస్తారు. డ్రోన్ షో: జనవరి 16 మరియు 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో అత్యాధునిక డ్రోన్ షోలు మరియు డ్రోన్ రేసింగ్ పోటీలు జరుగుతాయి. పార్కింగ్ సమస్యలు మరియు ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు మెట్రో లేదా ఇతర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఉపయోగించాలని అధికారులు సూచిస్తున్నారు. మరింత సమాచారం కోసం తెలంగాణ టూరిజం అధికారిక వెబ్‌సైట్ను సందర్శించవచ్చు.

# పేదరికానికి పెట్టుబడిదారీతనానికి మధ్య నలిగిపోతున్న భారత్

భారతదేశం ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతున్నట్లు అంచనాలు ఉన్నప్పటికీ,పేదరికం మరియు అసమానతలు ఇంకా తీవ్రంగా ఉన్నాయి.ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్ ఒక ఇంటర్వ్యూలో ఈ విషయంపై మాట్లాడుతూ,నియోలిబరల్ పెట్టుబడిదారీతనం భారతదేశంలో అధిక జిడిపి వృద్ధిని సాధిస్తున్నప్పటికీ,ఁఅసమానతలు మరియు పేదరికం పెరుగుతున్నాయని వివరించారు.ఆర్థిక వృద్ధి మధ్యలో అసమానతల భారతదేశం 2030 నాటికి 30 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుందని అంచనాలు ఉన్నాయి.అయితే గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో 127 దేశాలలో 105వ స్థానంలో ఉంది.ఇది భారతదేశ ఆర్థిక పరిమాణం జనాభా మరియు కొనుగోలు శక్తి పారిటీపై ఆధారపడి ఉందని,అభివృద్ధిపై కాదని పట్నాయక్ చెప్పారు. నియోలిబరల్ పెట్టుబడిదారీ తనం అధిక జిడిపి వృద్ధిని తెచ్చినప్పటికీ,వరల్డ్ ఇన్ ఇక్వాలిటీ డేటాబేస్ ప్రకారం అసమానతలు ఒక శతాబ్దంలో అత్యధిక స్థాయిలో ఉన్నాయి. పోషకాహార లోపం ఆధారంగా కొలిచే సంపూర్ణ పేదరికం 1990ల ప్రారంభంలో నియోలిబరలిజం ప్రారంభమైనప్పటి కంటే ఇప్పుడు మరింత తీవ్రంగా ఉంది.జాన్ స్టువర్ట్ మిల్‌ను ఉటంకిస్తూ, పట్నాయక్ ఇలా అన్నారు"జాన్ స్టువర్ట్ మిల్ శూన్య జిడిపి వృద్ధి స్థితి గురించి ఆందోళన చెందలేదు.దాని కింద కార్మికులు మెరుగైన జీవితాలు గడిపితే, కార్మికుల జీవన పరిస్థితులు ముఖ్యం కానీ,జిడిపి పరిమాణం కాదన్నారు.

### నిరుద్యోగం మరియు ఉద్యోగ నష్టాలు

నియోలిబరల్ విధానాలు నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. నిరుద్యోగ రేటు 8%కి చేరుకుంది. ఇది సంక్షోభానికి ముందు స్థాయి కంటే ఎక్కువ.వాణిజ్య ఉదారీకరణ శ్రమ ఉత్పాదకతను పెంచుతుంది.కానీ,ఉత్పత్తి మరియు ఉద్యోగ వృద్ధిని మందగింపజేస్తుంది.అసమానతలు పెరగడం వల్ల పేదలు వినియోగించే ఉద్యోగ-కేంద్రిత వస్తువుల డిమాండ్ తగ్గుతుంది. పెద్ద సంస్థలు చిన్న ఉత్పత్తి రంగాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. డెమోనిటైజేషన్ మరియు జిఎస్‌టి వంటి విధానాలు చిన్న-స్థాయి రంగాలను శాశ్వతంగా దెబ్బతీశాయి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉద్యోగాలను నాశనం చేస్తుందని,కేవలం సాంకేతిక ఎలైట్‌కు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తుందని పట్నాయక్ హెచ్చరించారు. హాలీవుడ్ రచయితల సమ్మెను ఉదాహరణగా చూపుతూ, నియోలిబరల్ పెట్టుబడిదా రీతనం కింద ఏఐని నియంత్రించడం సాధ్యం కాదని అన్నారు. పేదరికం మరియు సంక్షేమం మహారాష్ట్రలోని విదర్భలో 800 మంది రైతుల ఆత్మహత్యలు,24 కోట్ల మంది పేదరికంలో,80 కోట్ల కుటుంబాలు ప్రభుత్వ సాయంపై ఆధారపడు తున్నాయి.పోషకాహార లోపం 14% కంటే ఎక్కువ మందిని ప్రభావితం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో అపోషణ 1993-94లో 58% నుంచి 2017-18లో 80%కి పెరిగింది. ప్రైవేటీకరణ విద్య మరియు ఆరోగ్య ఖర్చులను పెంచి, సంక్షేమాన్ని ధ్వంసం చేస్తుంది. అమర్త్య సేన్ యొక్క 'సామర్థ్యాలు' మరియు 'నిజమైన స్వేచ్ఛ' భావనలను ఉటంకిస్తూ, ప్రజా విద్య మరియు ఆరోగ్యాన్ని ప్రైవేటీకరణ దెబ్బతీస్తుందని పట్నాయక్ చెప్పారు.



### ప్రపంచ సందర్భం మరియు నియో-ఫాసిజం

నియోలిబరలిజం ప్రపంచ వ్యాప్తంగా అసమానతలను పెంచుతుంది,ఇది స్టాగ్నేషన్‌కు దారితీస్తుంది.ఇది'నియో-ఫాసిజం' ను ప్రోత్సహిస్తుంది.ఇక్కడ కార్పొరేట్-ఫైనాన్షియల్ ఎలైట్‌లు విభజన శక్తులతో (భారత్‌లో కార్పొరేట్-హిందుత్వ) జతకడతాయి.సంక్షోభ సందర్భంలో ఈ బంధం నియోలిబరలిజం మరియు నియో-ఫాసిజం మధ్య ఉంది. భారతదేశం సబ్-సహారా ఆఫ్రికాతో సమానంగా ఉంది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్ 27.3,సబ్-సహారా ఆఫ్రికా 26.8. గా ఉన్నాయి.అయినా దీనికి పట్నాయక్ కొన్ని పరిష్కారాలు చూపారు.ఆహారం,ఉద్యోగం,ఉచిత ఆరోగ్యం,ఉచిత విద్య,నాన్-కాంట్రిబ్యూటరీ పెన్షన్‌ల వంటి ఆర్థిక హక్కులను రాజ్యాంగ బద్ధంగా గ్యారెంటీ చేయాలని ప్రతిపాదించారు.ఇవి టాప్ 1%పై 2% సంపద పన్ను మరియు మూడవ వంతు వారసత్వ పన్నుతో ఫండ్ చేయవచ్చు.ఇది గౌరవాన్ని నిర్ధారిస్తుంది.ఈ విధంగా,పెట్టుబడిదారితనం భారతదేశంలో పేదరికాన్ని తగ్గించకుండా,అసమానతలను పెంచుతుంది.అందుకే భారత ఆర్థిక స్థితి మార్పు కోసం సమగ్ర విధానాలు అవసరం.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

## జపాన్ పర్యటనకు ఎలగందల్ మోడల్ స్కూల్ విద్యార్థిని

**అభినందించిన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి**



**ధర్మఘంట జనవరి 13 కరీంనగర్:**

సకురా" సైన్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన ఎలగందల్ మోడల్ స్కూల్ విద్యార్థిని గుర్రాల శివాంజలిని మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు.తెలంగాణ మోడల్ స్కూల్ ఎలగందల్ లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న శివాంజలి రాత పరీక్ష,స్క్రీన్ టెస్ట్ ద్వారా ఈ పర్యటనకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుండి నలుగురు మాత్రమే ఈ పర్యటనకు ఎంపికవగా అందులో జిల్లాకు చెందిన శివాంజలి ఉండడం విశేషం.మే 24 నుండి 30 వరకు జపాన్ పర్యటించి అక్కడి పరిశ్రమలు,పరిశోధన సంస్థలను సందర్శిస్తారు.శివాంజలిని జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి,మిల్కూరి శ్రీనివాస్,ఎంఈఓ ఆనందం,ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్,తల్లిదండ్రులు కరుణాకర్,శారద పాల్గొన్నారు.

## 2027 ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సీఎం అభ్యర్థిగా ప్రియాంక?

**ధర్మఘంట, జనవరి 13,**



హైదరాబాద్: ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ కేంద్రబిందువుగా మారారు. నిన్న ఆమె 54వ పుట్టిన రోజు వేడుకలను పార్టీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. బి.సి లను ఆకర్షించేలా పరివర్తన్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపట్టింది. దీంతో 2027 యూ . పీ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ సీఎం అభ్యర్థిగా ప్రియాంక ఉంటారన్న ప్రచారం ఊపందుకుంది. ఆమె నేతృత్వంలో అధికారంలోకి రాగలమని కాంగ్రెస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు.

## నూతన కార్యవర్గాన్ని సన్మానించి అభినందించిన ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కలసిన జిల్లా పెరిక సంఘం అధ్యక్షులు సముద్రాల రాంబాబు**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జనవరి 13,(ధర్మ ఘంట) :**

సూర్యాపేట జిల్లా పు రగిరి క్షత్రియ పెరిక సంఘం జిల్లా కార్యవర్గ నూతన అధ్యక్షుడు సముద్రాల రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తిపాక జనార్దన్, జిల్లా యువజన అధ్యక్షుడు బుడిగం కిరణ్ కుమార్ లు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లా పురగిరి క్షత్రియ పెరిక సంఘం నూతన అధ్యక్షుడు సముద్రాల రాంబాబు తన కార్యవర్గం తో అందరిని కలుపుకొని పోతూ సంఘ పటిష్టతకు పాటుపడాలని సూచించారు. పురిగిరి క్షత్రియ పెరిక కులానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు



ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ సంఘం అధ్యక్షులు పత్తిపాక వేణూధర్, సహా అధ్యక్షులు యర్రం శెట్టి రామలింగయ్య, సంయుక్త కార్యదర్శి నట్టే కిరణ్ కుమార్, ప్రచార కార్యదర్శి దేవరగట్ల సతీష్, మార్కెట్ డైరెక్టర్ ఆర్తి కేశవులు, కుల ప్రముఖులు శ్రీరామ్ వెంకట్, మాజీ మార్కెట్ డైరెక్టర్ దాచేపల్లి భరత్, పిన్నెని శోభన్ బాబు, , పిన్నేని సందీప్, బిట్టు వీరయ్య, యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కొనకంచి శ్రీను, తొగరు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సేవకు జీవితం అంకితం చేసిన మహానీయుడు ఉప్పల మల్సూర్‌లిలి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జనవరి 13, (ధర్మ ఘంట)**

ప్రజా ప్రతినిధిగా ప్రజల సేవలో తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మాజీ ఎమ్మెల్యే ఉప్పల మాల్సూర్ అని సూర్యాపేట పూర్వ విద్యార్థుల పూర్వ విద్యార్థి మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అధ్యక్షుడు అధ్యక్షుడు నల్లకుంట్ల అయోధ్య లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే ఉప్పల మాల్సూర్ 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు చేసి నివాళులర్పించి మాట్లాడారు. సూర్యాపేట నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో గెలిచి ప్రజలకు సేవ చేయడమే కర్తవ్యం గా పనిచేసారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని నల్లాలా బావి వద్ద ఉప్పల మన్సూర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఒక్కసారి ఎమ్మెల్యేగా అయితేనే కోట్లు సంపాదించుకునే నేటి సమాజంలో నాలుగు సార్లు ఎమ్మెల్యే గెలిచి కనీసం ఇల్లు లేని జీవితం సాగించి నిస్వార్థంగా ప్రజలకు సేవ చేశారు అన్నారు. ఉప్పల మల్సుర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. బిన్ రెడ్డి, ధర్మబిక్షం, మల్లు స్వరాజ్యం,ఉప్పల మల్సూర్ నర్రా రాఘవరెడ్డి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్య మల్లికార్జున్, దేగల జనార్ధన్, నాతి సవేందర్, జిలకర చంద్రమౌళి, విద్యాసాగర్, సారగండ్ల మాణిక్యమ్మ, చిత్రం భద్రమ్మ,వీర్లపాటి వెంకన్న, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్సివ్ డ్రైవింగ్ తోనే రోడ్డు ప్రమాదాలకు చెక్..

**సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్..**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి జనవరి 13,(ధర్మ ఘంట) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను భాగస్వామ్యం చేయడం తద్వారా రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడం రోడ్డు నియమ నిబంధన పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం లక్ష్యంగా జిల్లాలో అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం ఒక రోడ్డు భద్రతా ఉద్యమంగా తీసుకోవడం జరిగిందని దీనిలో భాగంగానే ఈరోజు చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధి దురాజ్పల్లి గ్రామంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇంటి నుండి బయలుదేరి మరల ఇంటికి సురక్షితంగా చేరుకోవాలని ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిధిలో ఉద్యమంలా నిర్వహిస్తామని దీనిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ప్రమాద రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని సిఐ కోరారు. ఈ సందర్భంగా ఎస్సై



మహేష్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తామని చివ్వెంల పరిధిలో జాతీయ రహదారులు ఉన్నాయని వాటిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రణాళిక ప్రకారం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమం నందు ఎస్సై మహేష్ కుమార్, ఎస్ఐ కనకరత్నం, అధికారులు, గ్రామ పెద్దలు, స్థానిక యువత పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**డీఎంహెచ్ పుట్ట శ్రీనివాస్**

**మర్రిగూడ మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ**



**ధర్మఘంట జనవరి 13 మర్రిగూడ:**

వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యాధికారులు,సిబ్బంది అందుబాటు ఉండి మెరుగైన వైద్యం అందించాలని నల్లగొండ డీఎం అండ్ హెచ్ పుట్ట శ్రీనివాస్ అన్నారు.మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించి, ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి,డయాలసిస్ సేవలు, ఫార్మసీ,ల్యాబ్ ఆరోగ్య మహిళ కేంద్రాన్ని పరిశీలించారు.రోగులకు మధ్యాహ్న భోజనం సరఫరా గురించి ఆరా తీశారు.ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల స్నేహ భావంతో ఉండాలని,మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి,ఎంతమంది సిబ్బంది హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.డాక్టర్లు సమయపాలన పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర విభాగం సిబ్బంది అందరూ నిత్యం అందుబాటులో ఉండాలని,శానిటేషన్ సిబ్బంది హాస్పిటల్ ను,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.నిత్యం వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్



# కోరమీసాల వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్న బండి**

**ధర్మఘంట జనవరి 13**

హుస్నాబాద్:కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.మంగళవారం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కు స్థానిక బీజేపీ నేతలు కోలాటాలు, డప్పులతో ఘన స్వాగతం పలకగా,వారితో కలిసి మంత్రి శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్దకు రాగానే ఆలయ నిర్వాహకులు, పూజారులు ఎదురెళ్లి స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ



ప్రదక్షిణలు చేసిన అనంతరం వీరభద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతితో ముడిపడిన ఈ పండుగను తెలుగు ప్రజలందరూ సంతోషంగా,సంబురంగా జరుపుకుంటారని,విదేశీ సంస్కృతికి అలవాటుపడి మన సంస్కృతిని మర్చిపోతున్న ఈ తరుణంలో ముగ్గుల పోటీలు, సంక్రాంతి పోటీలు నిర్వహిస్తూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.కొత్తకొండ వీరభద్రస్వామి స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతి ఏటా రావడం ఆనవాయితీగా వస్తుందని,అందులో భాగంగా ఇక్కడికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నానని,కోరిన కోర్కెలు తీర్చే కోరమీసాల స్వామి వీరభద్రుడని చాలా సందర్భాల్లో నిరూపితమైందని,కోరమీసాల స్వామి కాబట్టి సమాజాన్ని నాశనం చేయాలనుకునేవాళ్లకు, చెడు ఆలోచనలు ఉన్న వాళ్లలో మార్పు తీసుకొచ్చే స్వామి వీరభద్రుడుగా కొలువు తీరాడన్నారు.ఈ జిల్లా,రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నానని చెప్పారు.భారత ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో భారత్ ను విశ్వగురుగా తీర్చిదిద్దేందుకు వికసిత్ భారత్ పేరిట శక్తివంచన లేకుండా కష్టపడుతున్నారని,ఈ తరుణంలో ప్రతి ఒక్కరూ మోదీకి అండగా నిలవాలని కోరుకున్నానన్నారు.ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర,పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు వస్తుంటారని, ఆలయ అభివృద్ధికి సహకరిస్తూనే ఉన్నానని,భవిష్యత్తులో కూడా నా వంతు కృషి చేస్తానన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

## సుబ్బంపేట గ్రామంలో రోడ్ సేఫ్టీ పై చర్ల పోలీసుల అవగాహన







**చర్ల**

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు నిబంధనలు పాటించాలని రోడ్డు భద్రతపై వాహనదారులు ప్రజలు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని చర్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ రాజు వర్మ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సుబ్బంపేట గ్రామంలో రోడ్ సేఫ్టీ పై పోలీసు శాఖ ప్రవేశపెట్టిన అరైవ్ అలీవ్ రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజు వర్మ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే దుష్పరిణామాలు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత వంటి అంశాలపై వివరించారు. ప్రజలు తమ ప్రాణ భద్రత కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని, తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే కుటుంబ సభ్యులకు కలిగే ఆవేదనను ప్రతి ఒక్కరు దృష్టిలో ఉంచుకోవాలని, నిబంధనలు, చట్టాలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రయాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, ఎస్ఐ లు ఆర్ నర్సిరెడ్డి, పి కేశవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తోగ్గూడెం మినీ మేడారం జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు!

## భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాలి
## పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

**మణుగూరు**

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను తలపించేలా పినపాక నియోజకవర్గం మణుగూరు మండలం తోగ్గుగూడెం గ్రామంలో ఈ నెల 28, 29, 30,31 తేదీల్లో జరగనున్న మినీ మేడారం జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ జాతర ఏర్పాట్లపై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, అన్ని ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సుమారు గంట పాటు సాగిన ఈ రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూలక్షలాదిగా తరలివచ్చే భక్తులకు నీరు, విద్యుత్, వైద్య సేవలు, పారిశుధ్యం, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ఇది ప్రజల పండగ అని, ప్రతి అధికారి అంకితభావంతో పని చేసి ఈ జాతరను మర్చిపోలేని రీతిలో నిర్వహించాలని, సూచించారు.తాగునీటి ట్యాంకర్లు, చేతి పంపులు, తాత్కాలిక మంచినీటి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి పూర్తి లైటింగ్ కల్పించాలన్నారు. అటవీ ప్రాంతంలో కూడా నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలి. రాత్రి వేళల్లో భక్తులు బస చేసే ప్రాంతాల్లో చీకటి లేకుండా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా



పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తోగ్గుడెం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, అభయ కమిటీ సభ్యులు, ఎంపీడీవో, సింగరేణి, పోలీస్, రెవెన్యూ తదితర అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పని చేసి ఈ మినీ మేడారం జాతరను చరిత్రలో నిలిచే విధంగా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

# సులానగర్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు






**టేకులపల్లి :** టేకులపల్లి మండలం సులానగర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ లక్ష్మనాయక్ ఆధ్వర్యంలో మకర సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ బజార్ లో నిర్వహించిన పోటీలో గ్రామం మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల ముగ్గులు గొబ్బెమ్మలతో సంక్రాంతి పండుగకు ఒక రోజు ముందే సులానగర్ లో పండుగ వాతావరణం కోలాహలంగా మారింది. యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలో ముఖ్య అతిథులుగా టేకులపల్లి సర్పంచ్ దంపతులు బోడ బాలు నాయక్, జ్యోతి ఉపసర్పంచ్ అనంతుల వసంత బిఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు రేణుకబీపాల్గొన్నారు. న్యాయ నిర్ణయితలుగా మండల మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్నపూర్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పవిత్ర, అంగన్వాడి టీచర్ పద్మ పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ 1000 రూపాయలు రెండో బహుమతి రూ: 500 మూడో భావతి రూ, 250 రూపాయలుగా నిర్ణయించి విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా నగదు అందజేశారు. సులానగర్ కార్పెంటర్ దాసోజు భాస్కరాచారి ముగ్గుల పోటీలో పాల్గొన్న అందరికీ గిఫ్ట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సులానగర్ సర్పంచ్ లక్ష్మనాయక్ మాట్లాడుతూ.. ముగ్గుల పోటీలతో సులానగర్ కూ సంక్రాంతి పండగా ముందుగానే వచ్చింది గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను మమేకం చేస్తూ పండుగ సంబరాన్ని ఉత్సాహంగా జరుపుకుంటామని, గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని గ్రామ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సులానగర్ సర్పంచ్ లక్ష్మా నాయక్, ఉప సర్పంచ్ ఉండేటి చెన్నయ్య, టేకులపల్లి సర్పంచ్ బోడా బాలు నాయక్,ఉపసర్పంచ్ అనంతుల వసంత , ఎన్.అన్నపూర్ణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షురాలు ఆమడ రేణుక,వార్డు మెంబర్ సరిలాల్, అంగన్వాడి టీచర్ పద్మ ,గుండా రవీందర్ రెడ్డి ,అరవ అప్పయ్య , అరవ గోపాల్ రావు, లక్పతి,వీరస్వామి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకి బియ్యం పంపిణీ చేసిన బీఆర్ఎస్ పార్టీ





**టేకులపల్లి**

టేకులపల్లి మండలంలోని బోడు పరిసర ప్రాంతాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో 50 కేజీల చొప్పున బియ్యం మంగళవారం అందజేశారు. బోడుకు చెందిన మురికి లాలయ్య, బోడు కుంపటి సరోజనమ్మ, బోడు కొత్తగూడెం కొండ్రు అశోక్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు బీఆర్ఎస్ బోడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బియ్యం అందచేశారు. బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చూసి గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇర్పా లక్ష్మీనారాయణ, పోతుగంటి వీరభద్రం, మాడ లాలయ్య, దూస ప్రశాంత్, పాయం రవి, మురికి నాగేశ్వరరావు, బొడ్డుపల్లి నరసింహారావు, నరసింహారావు, బోర్న రమేష్, ఈసం సత్యం, నల్లబోతుల సతీష్, మేకల సతీష్, పోదాం నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక కుటుంబాల్లో సరికొత్త కాంతులు టిబిజికెయస్ తోనే సాధ్యం



**మణుగూరు**

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు, టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర కమిటి సభ్యులకు మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలతో పాటు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. మంగళవారం గోదావరి ఖని నందు ఆయన స్వయంగా కలసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు అందించారు. సింగరేణి సంస్థ ప్రగతి కోసం రేయింబవళ్లు కష్టపడి పనిచేసే కార్మికుల బంగారు భవిష్యత్తుకు వారి కుటుంబ సభ్యులకు కొత్త సంవత్సరం మరిన్ని విజయాలు చేకూర్చాలని ప్రతి కార్మిక కుటుంబాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. గత రెండేళ్లుగా కార్మికులు అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటూ వాటిని అధిక మించేందుకు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్ ఫలితం లేకుండా పోతుందని సింగరేణి లో టి బి జి కె యస్ తిరిగి అధికారం పొందాలని కార్మిక వర్గం ఎదురు చూస్తున్నారని ఆయన తెలిపారు. టి బి జి కె యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ దిశ నిర్దేశం, కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న టి బి జి కె యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి నాయకత్వం ద్వారా నల్ల నేలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముగిసిన వాలీబాల్ టోర్నీ విజేతగా ఆనందాపురం రన్నర్ రాజీవ్ నగర్



**ములకలపల్లి**

ఉమ్మడి తిమ్మంపేట, పొగళ్లపల్లి పంచాయతీల స్థాయిలో తిమ్మంపేట పంచాయతీ రాజీవ్ నగర్ లో రెండు రోజులుగా సాగిన వాలీబాల్ టోర్నీ నిన్నటితో ముగిసింది. కోండ్రు అంజయ్య, సోయం గంగులు, సోయం మహేష్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీలో 10 జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో రాజీవ్ నగర్, ఆనందాపురం జట్లు తలపడగా ఆనందాపురం జట్టు విజయం సాధించిగా రాజీవ్ నగర్ రన్నర్ గా నిలిచింది. గెలుపొందిన వారికి సర్పంచ్ తుర్రం శ్రీను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర రావు, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు క్రాంతి, సోయం వీరభద్రం బహుమతులు ప్రధానం చేశారు. విజేత జట్టు ఆరువేల రూపాయల ప్రైజ్ మనీ కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి అందజేశారు. రెండవ బహుమతి నాలుగు వేల రూపాయలు సర్పంచ్ తుర్రం శ్రీను అందజేశారు.

## మూకమామిడి ప్రాజెక్టులో రొయ్య పిల్లలు విడుదల

**ములకలపల్లి**



జిల్లా మత్స్య శాఖ ద్వారా వంద శాతం సబ్సిడీతో మత్స్యకార సొసైటీకి మంజూరైన లక్ష రొయ్య పిల్లలను మూకమామిడి ప్రాజెక్టులో సర్పంచ్ కొర్సా ఆదిలక్ష్మి మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల మత్స్యశాఖ అధికారులు మిడియం మంగరాజు, కుంజా సూర్యప్రకాష్ సంఘ సభ్యులు కీసరి వెంకటేశ్వర్లు, కొర్సా నాగేశ్వరావు, కీసరి రాములు, పైదా కోటేష్ రైతులు సున్నం వీరస్వామి, మడకం రాజులు, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.